మహబూబ్‌నగర్



వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట

# ఆర్థిక అక్షరాస్యత పెంపొందించడమే లక్ష్యం

**ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో "ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. భారతదేశంలో జరుపుకునే ఒక ప్రధాన కార్యక్రమం. ఆర్థిక అక్షరాస్యతను ప్రోత్సహించడం, ప్రజలలో ఆర్థిక అవగాహనను పెంచడం ఈవారోత్సవాల లక్ష్యమని ఆమె అన్నారు. ఈ సంవత్సరం "పొదుపు చేసే మహిళ సాధిస్తుంది ఘనత" అనే అంశంపై నిర్వహించనున్నట్లు తెలిపారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కల్వ భాస్కర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామ గ్రామాన ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. మహిళామండలి, మహిళా వ్యాపారవేత్తలు, సాధారణ గృహిణిలు మూడు కేటగిరీలకు చెందిన మహిళలుకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలలో భాగంగా పొదుపు, అప్పు తీసుకుంటే రుణం ఏ సంస్థల నుండి తీసుకోవాలి, ప్రభుత్వ సంస్థల ద్వారానే తీసుకోవాలి, ప్రైవేట్ సంస్థలు, వ్యక్తుల నుండి తీసుకుంటే అధిక వడ్డీలు వసూలు చేసి ఆర్థికంగా నష్టం కలుగుతుందని తదితర విషయాలపై అవగాహన కలిగించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, ఆర్‌డిఓ నవీన్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, జిల్లా బిసి అభివృద్ధి అధికారిణి ఇందిర, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి జరీనా బేగం, జిల్లా మత్స్య శాఖ అధికారిణి రాధ రోహిణి తదితరులు పాల్గొన్నారు.




పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

# పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన రిజిస్ట్రార్

**మహబూబ్‌నగర్ బ్యూరో ఫిబ్రవరి 24 ప్రభాత వార్త:** పాలమూరు యూనివర్సిటీ పరిధిలో పీజీ 3వ సెమిస్టర్ పరీక్షలు నాల్గోవరోజు ప్రశాంతంగా కొన సాగుతున్నాయి. యూనివర్సిటీ పీజీ పరీక్ష కేంద్రా న్ని రిజిస్ట్రార్ ఆచార్య చెన్నప్ప ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చెయ్యాలని, పరీక్ష కేంద్రంలో విద్యార్థులు తాము కూర్చునే చోట ఏదయినా ప్రింటెడ్ మెటీరి యల్ ఉంటే మీదే బాధ్యత అని, చూచి రాతకు పాల్పడితే విద్యా సంవత్సరం నష్ట పోవాల్సి వస్తుందని అన్నారు. రిజిస్ట్రార్ వెంబడి చీఫ్ సూపరింటెండెంట్ డా.మధుసూదన్ రెడ్డి, పరిశీలకులు డా.అనురాధ రెడ్డి ఉన్నారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న రిజిస్ట్రార్ చెన్నప్ప

# క్షణక్షణం ఉత్కంఠ..




- ▶▶ 60గంటలు దాటినా సిబ్బంది ఆచూకీ దొరకలే
- ▶▶ రెస్క్యూ ఆపరేషన్ మరో రెండు రోజులు కొనసాగే అవకాశం
- ▶▶ ఆక్వా ఐ పరికరంతో సిబ్బందిని గుర్తించే చర్యలు



సహాయక చర్యలపై సమీక్షిస్తున్న మంత్రి కోమటిరెడ్డి, జానారెడ్డి, ఎమ్మెల్యే వంశీకృష్ణ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** నాగర్ కర్నూల్ జిల్లా దోమల పెంట ఎస్ఎల్‌బిసి టన్నల్ లో చిక్కుకున్న 8 మంది సిబ్బందిని రక్షించేందుకు రెస్క్యూ బృందాలు చర్యలు మరింత వేగవంతం చేశారు. నీటి లోపల 50 మీటర్ల లోతు వరకు ఉన్న మనుషులను గుర్తించేందుకు ఆక్వా ఐ పరికరాన్ని ఉపయోగిస్తుంటారు. ఇదే పరికరాన్ని సిబ్బంది తీసుకెళ్లి టన్నెల్ లో చిక్కుకున్న వారి ఆచూకీని గుర్తించే చర్యలు చేపట్టారు. 50 మీటర్ల లోతులో మనుషులు ఉంటే ఆక్వా ఐ పరికరం గుర్తిస్తుంది. ప్రమాదం జరిగి 48 గంటలు దాటడంతో నేవీ ఆపరేషన్ కీలకంగా మారింది. 200 మీటర్ల పాటు నీరు బురద నిండిపోయి ఉండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతున్నట్లు మంత్రి జూపల్లి తెలిపారు. ఎల్అండ్‌టి కంపెనీ నుంచి తీసుకొచ్చిన ఫ్లెక్సీ ప్రోబ్ పరికరం టన్నెల్లోకి పంపేందుకు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఫ్లెక్సీ ప్రో పరికరానికి కెమెరా అనుసంధానం చేసి సిబ్బంది ఆచూకీ గుర్తించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అయితే నిన్న 12వ కిలోమీటర్‌వద్ద బురద, నీరు ఎదురు కాగా సోమవారం 10వ కిలోమీటర్ వద్దే నీరు బురద ఎదురు కావడంతో రిస్క్ ఆపరేషన్ ఇబ్బందిగా మారిందని రెస్క్యూ సిబ్బంది చెబుతున్నారు. అడుగు తీసి అడుగు వేసే పరిస్థితి లేదని నేవీ సిబ్బంది చెబుతున్నారు. రెస్క్యూ సిబ్బందికి టన్నెల్లో ఆక్సిజన్ ఇబ్బందులు కలగకుండా ఎయిర్ బ్లోయర్ పంపించి ఆక్సిజన్ అందజేస్తున్నారు. కన్వేర్ బెల్ట్ నుంచి రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్న నేవీ ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ప్రాణాలకు తెగించి మరీ రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్న నేవీ, ఆర్మీ ,ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు 40 కిలోమీటర్ల పొడవునా ఉన్న టన్నెల్లో మరెక్కడా లోపలికి వెళ్లడానికి బయటకి రావడానికి దారులు లేవు ఒక్క ఇన్ గెట్ తప్ప వేరే అవకాశాలు లేకపోవడంతో రెస్క్యూ మరింత ఇబ్బందిగా మారింది.



టన్నెల్‌లో సహాయక చర్యలను స్వయంగా తెలుసుకుంటున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

## ఎస్ఎల్‌బిసి టన్నల్ పై సంక్షిప్తంగా..

ఎస్ఎల్‌బిసి టన్నెల్లో గాలి దూరదు.. ఊపిరి కూడా ఆడదు. అంతటి క్లిష్ట వాతావరణ పరిస్థితుల్లో సిబ్బంది పని చేయాల్సి ఉంటుంది. ప్రపంచంలోనే అతిపొడవైన ఇరిగేషన్ టన్నెల్ ఇది. పైపుల ద్వారా ఆక్సిజన్ పంప్ చేస్తూ పనులు కొనసాగిస్తూ వస్తున్నారు. టన్నెల్ పొడవునా మొత్తం పైభాగం అంతా కొండలు, గుట్టలు దట్టమైన రాళ్లు మాత్రమే ఉంటాయి. 1980వ సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి అంజయ్య ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. గతంలో మరుగున పడ్డ ప్రాజెక్టుకు బీఆర్ఎస్ పాలనలో రూ.500 కోట్లు కేటాయించడంతో పనులు నామమాత్రంగానే కొనసాగాయి. తదనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కృత నిశ్చయంతో ఉన్నది. 2026 కల్లా కంప్లీట్ చేసేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్టు అధికార యంత్రం వెల్లడించింది. ఇలా ఉండగా పనులు ఇటీవలే ప్రారంభం కావడం ఇంతలోనే టన్నెల్ కుప్పకూలడంతో తీవ్ర ఆటంకం ఏర్పడింది. టన్నెల్లో చిక్కుకున్న ఎనిమిది మందిని సురక్షితంగా కాపాడేందుకు ఎన్డీఆర్ఎఫ్, నేవీ, ఎస్డీఆర్ఎఫ్, ఆర్మీ రెస్క్యూ బృందాలు నిరంతరంగా శ్రమిస్తున్నాయి.

## 584మంది నిపుణులు

# ఏడు సార్లు తనిఖీలు..

- ▶▶ అయినా దక్కని ఫలితం
- ▶▶ నిరంతరంగా కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త:** ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లో దోమలపెంట వద్ద జరిగిన ప్రమాదంలో చిక్కుకున్న వారిని వెలికితీయడానికి కేంద్ర, రాష్ట్ర విపత్తు బృందాలతో పాటు ఆర్మీ, నేవి, సింగరేణి, కేంద్ర ప్రభుత్వ రహదారుల విభాగం, జేపీ, నవయుగ లకు చెందిన ఉన్నతాధికారుల బృందం ఇప్పటివరకు ఏడు సార్లు టన్నెల్‌లో తనిఖీలు నిర్వహించాయి. వీరి బృందంలో దాదాపు 584 నిపుణులైన సిబ్బంది ఉన్నారు. ఉత్తరాఖండ్‌లో జరిగిన విపత్తులలో ఈ బృందాలు రెస్క్యూ ఆపరేషనలను సమర్థవంతంగా నిర్వహించాయి. వీరితోపాటు 14 మంది ర్యాట్ ( ర్యాట్ హోల్ టీమ్)మైనర్స్‌ల సేవలను ముమ్మరంగా ఉపయోగిస్తున్నారు. వీరితోపాటు , టన్నెల్ లో ఉన్న వారి ఆచూకి తెలుసుకునేందుకు స్నిఫ్ఫర్ డాగ్స్‌లను కూడా రప్పించారు. అయితే, నీరు ఉన్నందున ఈ స్నిఫ్ఫర్ డాగ్స్ లోపలికి వెళ్లలేక పోయాయి. ఇప్పటికే డ్యామేజి అయిన కన్వీయర్ బెల్ట్ కు మరమ్మత్తులు చేపట్టారు. కాగా, టన్నెల్ లోపలికి పై నుండి రంధ్రం చేసి లోపలికి వెళ్లాలన్న (వర్టికల్ డ్రిల్లింగ్ ) ప్రతిపాదనను తోసిపుచ్చారు. 5గ్యాస్ కట్టింగ్ మిషన్లు రేయిం, పగల్లు పని చేస్తున్నాయి. కాగా, టన్నెల్ లో సహాయ కార్యక్రమాలను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సోమవారం ఉదయం నుండి దోమలపెంట ప్రాజెక్టు సైట్ లో ఉండి పర్యవేక్షిస్తున్నారు. సాయంత్రం జెపి కార్యాలయంలో సహాయ కార్యక్రమాలపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ -మిగతా4లో..



సహాయక చర్యల్లో ఎస్పీ గైక్వాడ్

# గతంలో తొలగించిన వ్యక్తికే మళ్లీ పోస్టింగ్..?

- సేమ్ పోస్ట్..సేమ్ పొజిషన్..
- అనధికారికంగా తాత్కాలిక విధుల్లో చేరిన వ్యక్తి
- నారాయణపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వెలుగులోకి..

**నారాయణపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** గతంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తాత్కాలిక విధుల నుంచి తొలగించిన వ్యక్తికే మళ్లీ అదే స్థానంలో పోస్టింగ్ ఇవ్వడంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళ్తే నారాయణపేట సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రోజుకు 20 నుంచి 30 వరకు డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరుగుతుంటాయి. గతంలో 9 ఏండ్లకు పైగా మహమ్మద్ సమీయోద్దీన్ అనే వ్యక్తి తాత్కాలిక ఉద్యోగిగా పనిచేశారు. సదరు వ్యక్తి ప్రతి డాక్యుమెంట్‌కు ఓ రేటు ఫిక్స్ చేసి కార్యాలయంలో అంతా తన ఆధీనంలో పెట్టుకుని వ్యవహారం నడిపించినట్లు సమాచారం. అయితే అప్పట్లో అతనిపై అవినీతి ఆరోపణలు రావడంతో కలెక్టర్ విధుల నుంచి తొలగించారు. ఇదే విషయమై గతంలో పలు దినపత్రికల్లో కథనాలు కూడా వెలువడ్డాయి. అదే సమయంలో ప్రస్తుతం పని చేస్తున్న సబ్ రిజిస్ట్రార్‌ను కూడా బదిలీ చేయాలని జిల్లా రిజిస్టార్ రవీందర్‌కు సూచించడంతో సబ్ రిజిస్టర్ రామ్‌జీని పాలమూరు జిల్లా రిజిస్టర్ కార్యాలయానికి బదిలీ చేశారు. తాత్కాలిక ఉద్యోగ పనిచేస్తున్న సదరు వ్యక్తిని నారాయణపేట సబ్ రిజిస్టర్ కార్యాలయం విధుల నుంచి తొలగించడంతో తన పలుకుబడిని ఉపయోగించి గద్వాల సబ్ రిజిస్టర్ కార్యాలయంలో తిరిగి విధుల్లో చేరాడు. అక్కడ కూడా తన వ్యవహార తీరు శైలి మారకపోవడంతో విధుల నుంచి తొలగించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా అదే వ్యక్తి తిరిగి మళ్లీ నారాయణపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అదే విధుల్లో చేరడంతో స్థానికంగా చర్చకు దారి తీసింది. ఒకసారి అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తిని విధుల నుంచి తొలగించగా తిరిగి అదే వ్యక్తి అదే కార్యాలయంలో విధుల్లో చేరడం కొసమెరుపు. ఇదే విషయమై నారాయణపేట సబ్ రిజిస్ట్రార్‌ను వివరణ కోరగా గతంలో మహమ్మద్ సమీని కలెక్టర్ విధుల్లో నుంచి తొలగించిన మాట వాస్తవమే అని తెలిపారు. ప్రస్తుతం స్థానిక శాసనసభ్యురాలు సూచన మేరకు సదరు వ్యక్తిని విధుల్లోకి చేర్చుకున్నట్లు వెల్లడించారు. శాఖపరంగా కార్యాలయంలో వేకెన్సీ పొజిషన్ లేకుండా అనధికారికంగా విధుల్లోకి తీసుకోవడంపై మతలబు ఏంటి అని గుసగుసలు వినిపిస్తున్నాయి.

# ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

**గద్వాల, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదా య సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 22 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగరావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, ప్రజల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పజావాణిలో దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్

## ప్రజావాణి ఫిర్యాదులను

# వేగంగా పరిష్కరించాలి

**వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**


**వనపర్తి టౌన్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, అర్జీలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం తో కలిసి హాజరై ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో 66 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, అర్జీలను పరిశీలించి, సత్వర పరిష్కారం చూపేలా సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీఎం, జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చిన, పెండింగ్ లో ఉన్న అర్జీలను సైతం వారంలో పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

# పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు

**వనపర్తి టౌన్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షలను వనపర్తి జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మార్చి,5నుంచి 20వరకు ఇంటర్మీడియట్ మొదటి,ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించనుండగా మార్చి, 21 నుంచి ఏప్రిల్ 4 వరకు పదవతరగతి పరీక్షలు నిర్వహించనున్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 5 నుంచి ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారు. వనపర్తి జిల్లాలో ఈ సారి 121 50మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 6457 మంది ఉండగా ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసేవారు 5693 మంది ఉన్నారు. పరీక్షల నిర్వహణకు జిల్లాలో 25 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేయడం జరిగింది. జిల్లాలో మొత్తం 6887 మంది విద్యార్థులు వార్షిక పరీక్షలు రాయనున్నారు. ఇందులో 6853 మంది రెగ్యులర్ విద్యార్థులు కాగా 34మంది ఒకసారి ఫెయిల్ అయినవారు కంపార్ట్మెంట్ పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు 36 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలక్టర్ అధ్యక్షతన సంబంధిత జిల్లా అధికారులతో పరీక్షల నిర్వహణ పై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వివరిస్తూ పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడమే కాకుండా ఎలాంటి మాల్ప్రాక్టిస్ జరుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ శాఖ ద్వారా పరీక్షలు జరిగేటప్పుడు 144 సెక్షన్ అమలు చేయడం, జీరాక్స్ కేంద్రాలు మూసి ఉంచటం, ప్రశ్నా పత్రాల తరలింపులో ఎస్కార్ట్ ఇవ్వడం, ఫ్లయింగ్ స్క్వాడ్ కు ఎస్కార్ట్ ఇవ్వడం వంటి చర్యలు పకడ్బందీగా తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాలను శుభ్రంగా ఉంచటం, త్రాగు నీరు సౌకర్యం కల్పించాలని, మున్సిపాలిటీ, పంచాయతీ రాజ్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునే విధంగా పరీక్షా కేంద్రాల రూట్లలో బస్సులు సకాలంలో నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు, అదనపు కలక్టర్ లోకల్ బాడీస్ (ఇన్చార్జి) యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి అంజయ్య, డిస్పి కే. ఉమామహేశ్వర రావు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




పరీక్షల నిర్వహణ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

# వేసవిలో తాగునీటి ఇబ్బందులు రానివ్వద్దు

**ప్రజావాణి అర్జీలను సత్వరం పరిష్కరించాలి మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి**

**మహబూబ్‌నగర్‌బ్యూరో, ఫిబ్రవరి24 ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యాలయంలో ప్రజల నుండి అందిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశమందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 135 మంది అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కారం చేయాలని అధికారులను సూచించారు. ప్రజావాణిలో రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపాలిటీ, బి.సి. అభివృద్ధి శాఖ, బ్యాంకింగ్ తదితర శాఖలకు చెందిన అర్జీలు స్వీకరించారు. ప్రజావాణి అర్జీలు పెండింగ్ లేకుండా అధికారులు చూడాలని సూచించారు. అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ వేసవి కాలం పూర్తి అయ్యే వరకు త్రాగు నీరు, విద్యుత్ సరఫరా పై మండలంలోని గ్రామాల వారీగా మండల ప్రత్యేక అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. వేసవిలో విద్యుత్ సరఫరా పీక్‌లో ఉన్నందున విద్యుత్ సరఫరా పరిస్థితిని, త్రాగు నీరు సరఫరాలో సమస్యలు ఉత్పన్నం కాకుండా ఆయా గ్రామాల్లో, పట్టణాల్లో చర్యలు తీసుకోవాలన్నారు. ఎండలు తీవ్రత ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బ బారిన పడకుండా అధికారులు అవగాహన కలిగించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటుచేసి తాగునీరు, విద్యుత్, వేసవి ఉష్ణోగ్రతలపై సమీక్షించాలన్నారు. సంక్షేమ వసతి గృహాలు, కెజిబివిలు, గురుకుల పాఠశాలలు రెగ్యులర్‌గా మండల ప్రత్యేక అధికారులు తనిఖీ నిర్వహించి ఎక్కడైనా అత్యవసర రిపేర్‌లు అవసరం ఉంటే వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. పారిశుధ్యం, స్వచ్ఛత వంటి అంశాలు, ఇతర సమస్యలు ఉంటే ఆయా గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలు, కెజిబివిలకు సూచనలు చేస్తూ సరిదిద్దుటకు సంబంధిత వార్డెన్‌లు, ప్రిన్సిపాల్‌లకు ఆదేశాలు జారీచేసి తీసుకున్న చర్యలనివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, అర్.డి. ఓ నవీన్, జడ్‌పి సిఈఓ పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

## ఔటర్ రింగ్ రోడ్డు అడ్డాగా

# ఇసుక దందాలు



ఔటర్ రింగ్ రోడ్డు దగ్గర నిలిచి వున్న ఇసుక ట్రాక్టర్లు

**వ్యాపార సముదాయాలుగా పట్టణ శివారు ప్రాంతాలు**

**అధిక ధరలకు విక్రయిస్తున్న మీడియేటర్లు**

**పట్టించుకోని అధికారులు**

**గద్వాల టౌన్, ఫిబ్రవరి 24, ప్రభాత వార్త:** ప్రకృతి వనరులలో ఇసుక అనేది ఒకటి... కానీ దానికి ఈ రోజుల్లో వున్న డిమాండ్ గత 10 సంవత్సరాల క్రితం లేదు. ఇప్పుడు అదే కొందరి అక్రమార్కులకు, ఇసుక మాఫియాకు ఓ బంగారు గనిలా మారింది. కొత్తగా ఇంటి నిర్మాణము చేపట్టిన ఇంటి యాజమానుల అవసరాలను అసరగా చేసుకొని కొందరు మిడియేటర్లు గద్వాల పట్టణం, గద్వాల పరిసర గ్రామాలలో ఇసుకను అధిక ధరలకు విక్రయిస్తున్నా సంబధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ చేసుకోవడం తెలియని ఇంటి నిర్మాణ యజమానులే మీడియేటర్స్‌కు టార్గెట్ ఇంటి యజమానికి ఆన్ లైన్ బుకింగ్ తెలిసినా ఇల్లుకట్టే మేస్త్రిపైన ఆధారపడి వుంటాడు. కాబట్టి ఏ అవసరానికి ఏ రకం ఇసుక కావాలో అదే ఇసుకను మేస్త్రికి చెప్పి బుక్ చేయమంటాడు. దీనిని ఆసరాగా చేసుకున్న ఇసుక మాఫియా మీడియేటర్లు వారి అవసరాన్ని ఆసరాగా చేసుకొని జేబులు నింపుకుంటున్నారు. వాస్తవానికి ఇంటి యజమాని పేరు గల సిమ్ కార్డు పై ఇసుక ఆన్ లైన్ బుకింగ్ చేయాలి కానీ మిడియేటర్స్ వారి సొంత సిమ్ తో పాటు వారి సన్నిహితుల సిమ్ తో వాస్తవ ఇంటి నిర్మాణ యజామానుల కన్నా ముందే మధ్యవర్తులు ఆన్ లైన్‌లో ఎంతవరకు బుకింగ్ అయితే అంతవరకూ అన్నీ స్లాట్స్ బుకింగ్ చేసుకుంటున్నారు. ప్రభుత్వము నిర్ణయించిన ఆన్ లైన్ బుకింగ్ ఏ రకం ఇసుక ధర అయినా రూ,5900/- నుండి 6100/- వరకు అవుతుంది. ఇదే ఆన్ లైన్ ధర ప్రకారంగా రోజుకు ఒక్క సిమ్ము పేరిట 5 ట్రాక్టర్ల లోడ్ బుకింగ్ చేసుకోవచ్చు. ఇదే అదునుగా మీడియేటర్స్ 4,5 రకాల సిమ్ కార్డులను ఉపయోగించి దాదాపుగా ఒక్కొక్క మీడియేటరు 10 నుండి 20 ట్రాక్టర్ల ఇసుకను బుకింగ్ చేస్తున్నారు. ఆన్ లైన్ ధరకు అదనంగా కస్టమర్ అవసరాన్ని బట్టి, ఇసుక రకాన్ని బట్టి 6500/- నుండి 8000/- వరకు విక్రయిస్తున్నారు. ఇలా రోజుకు ఒక్కొక మీడియేటర్ ఒక్క ట్రాక్టర్ లోడ్ పై దాదాపుగా 500/- నుండి 1000/- రూపాయలకు పైగా దండుకుంటున్నారు. ప్రస్తుతం పట్టణం, పట్టణ పరిధిలో జరుగుతున్న కొత్త ఇంటి నిర్మానాలను బట్టి రోజుకు ఒక్కొక మీడియేటర్ దాదాపుగా 10 ట్రాక్టర్ల పైగా విక్రయాలు జరుపుతున్నాడని సమాచారం. దీన్ని బట్టి ఒక్కొక్క మధ్యవర్తి వ్యాపారి రోజుకు దాదాపుగా 10 వేల వరకు సంపాదిస్తున్నాడని తెలుస్తుంది. ఈ సంపాదనను రుచి మారిగిన మీదియేటర్స్ సంబధిత అధికారులను సైతం కై కట్టుకుని మామూల్లను ఎరజూపి మూడు పువ్వులు ఆరు కాయలుగా దర్జాగా ఇసుక దందా -మిగతా3లో..

### ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలలో భాగంగా

## గోడ పత్రికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

**గద్వాల,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** జిల్లాలో ఈ నెల 24 నుండి 28 వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్స వాలు నిర్వహించి బ్యాంకు లావాదేవీలపై మహిళలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అధికారులతో కలిసి గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలకు పొదుపు, బ్యాంకులలో అకౌంట్ తెరవడం, బ్యాంకుల ద్వారా రుణాలు పొందడం తదితర 65 అంశాలపై వారం రోజుల పాటు జిల్లాలోని అన్ని మండల కేంద్రంలో బ్యాంకర్లు ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మినారాయణ, నర్సింగరావు, ఎల్ డి ఎం అయ్యప్ప రెడ్డి లతో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్నా కలెక్టర్ సంతోష్

### దేవాలయ భూములు కాపాడాలంటూ

## మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు

**ఆత్మకూరు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** ము న్సి పల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని మూడవ వార్డులో గజ్జలమ్మ దేవాలయం పరి సర ప్రాంతంలో గల భూములను కాపాడా లంటూ ఆ కాలనీకి చెందిన పలువురు సోమ వారం రోజు ఆత్మకూరు మున్సి పల్ కార్యాల యంలో ఫిర్యాదు చేశారు. మూడవ వార్డులో ని గజ్జలమ్మ దేవాలయం చుట్టుపక్కల పట్ట ణానికి చెందిన పలువురు అన్యమతస్తులు డబ్బాలను, షెడ్లను ఏర్పాటు చేసుకొని వ్యా పార కార్యకలాపాలు నిర్వహించుకోవడం ఎంతవరకు సమంజసమని వారు అధికారులు ప్రశ్నించారు. దేవాలయ భూములను పరిరక్షించి భక్తులకు సౌకర్యాలు మెరుగుదలకు మున్సి పల్ కమిషనర్, ప్రజాప్రతినిధులు తమ వంతు సహకారం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. మున్సి పల్ కమిషనర్ కు ఫిర్యాదు చేసిన వారిలో పరుశురాములు నర్సింలు, కురుమయ్య, ఆలయ పూజారులు ఉన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**నవాబుపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండల పరిధిలోని కారుకొండ మీదుగా సిద్ధోటం మధ్యలో సోమవారం తెల్లవారు జామున అక్రమ అక్రమ ఫిల్టర్ ఇసుక రవాణా చేస్తున్న ఎపి 27 యు బి 2655 గల ఇసుక ట్రాక్టర్ కిష్టారం గ్రామానికి చెందిన బండ యాదయ్య ట్రాక్టర్‌ను పోలీసులు ఎస్‌హెచ్‌ఓ ఆదేశాల మేరకు అశోక్ గౌడు హుస్సేన్ ఆపి తనిఖీ చేసి నవాబుపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా అనుమతులు లేని ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు, వాహనాలను సీజ్ చేయబడతాయని ఎస్సై విక్రం తెలియజేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాలను కూడా బేఖాతరు చేస్తూ అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆదేశాలు చేసిన విషయం తెలిసిందే.



ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్న పోలీసులు

## డివిజన్ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** అచ్చంపేట డివిజన్ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు సోమవారం మండలంలోని ఐనోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ పోటీలకు డివిజన్ స్థాయిలో అన్ని మండలాల క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ చదువుతోపాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని వాలీబాల్ టోర్నమెంట్‌లో డివిజన్ స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి అధిరోహించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకుముందు క్రీడా ప్రాంగణంలో క్రీడాకారులకు కరచలనం చేపట్టారు. జిల్లా గెజిటెడ్ హెచ్‌ఎంలో సంఘం అధ్యక్షుడు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి,ఆ పాఠశాల హెచ్‌ఎం డి.బాలస్వామి, నడింపల్లి హెచ్ ఎం.అర్జునయ్య, పి ఆర్ టి యు మాజీ జిల్లా అధ్యక్షుడు సూర్య పల్లి శ్రీనివాస్‌గౌడ్, డివిజన్ స్థాయిలో అన్ని పాఠశాల హెచ్‌ఎంలు, పిడిలు, విద్యార్థులు, వాలీబాల్ టోర్నమెంట్ క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం

## వెల్టూర్ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** మండలంలోని వెల్టూరు గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బ్రహ్మోత్స వాలు కొనసాగుతుంది. ఈనెల 21 నుంచి ప్రారంభమైన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బ్రహ్మోత్స వాలు వైభవంగా కొన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లిని దండోరా డప్పుల మధ్యన, బైండ్ల వారి పూజారులతో గంగా స్థానం, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏడు రోజులుగా కొనసాగే ఈ బ్రహ్మోత్స వాల్లో భాగంగా సోమవారం నాటికి గంగ స్థానానికి తీసుకెళ్లారు. నేడు మంగళవారం శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు నరసయ్య, గుద్దటి బాలరాజు, దుర్గయ్య, నిరంజన్, లక్ష్మయ్య, ఉప్పరి బాలరాజ్, మల్లేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి విగ్రహాలను జలాభిషేకానికి తీసుకెళ్తున్న దృశ్యం

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**నవాబుపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రిలో చికి త్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అమ్మపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే అమ్మ పూర్ గ్రామానికి చెందిన అంకురి కృష్ణయ్య (57) తాపీమేస్త్రి. రోజువారి పనుల నిమిత్తం నవాబుపేట కేంద్రంలో కూలి పనులు ము గించుకుని తిరుగు ప్రయాణంలో 19 ఫిబ్రవరి బుధవారం తన ద్విచక్రవాహనం టీవీఎస్ ఎక్సెల్ టిఎస్ 06 జడ్‌టిఆర్ 4961 మీద తిరుగు ప్రయాణంలో చిర్ర సత్యనారాయణ వ్యవసాయ భూమి దగ్గర ఎదురుగా వచ్చిన నవపేటకు చెందిన సమీర్ తండ్రి బషీర్ అను వ్యక్తి తన ద్విచక్ర వాహనమైన టిఎస్ 07 ఎఫ్‌డబ్ల్యు 3816 పల్సర్ 200సిసి వాహనము అతివేగంతో ఢీకొనడంతో మేస్త్రి అంకురి కృష్ణయ్యకు తీవ్రగాయాలయ్యి తలకు నడుము భాగంలో తొడభాగంలో పిక్కలదగ్గర ఎముకలు విరిగిపోయి చెవి నుండి రక్తం రావడంతో బాటసారులు 108అంబులెన్స్‌కి కాల్‌చేసి మహబూబ్నగర్ ప్రభుత్వఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఉస్మానియాహాస్పిటల్‌కు తరలించారు.గాయాలపాలైన అంకురీ కృష్ణయ్య హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తేదీ23 ఆదివారం రాత్రి చనిపోయాడు.కుమారుడు మణికంఠ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## 3ఎకరాల రైతులకు రైతు భరోసా నిధుల జమ


### ఉమ్మడి మండలంలో 10 వేల 248 మంది రైతులకు లబ్ధి : వ్యవసాయ అధికారి రవికుమార్

**ఇటిక్యాల, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** ఉమ్మడి ఇటిక్యాల.ఎర్రవల్లి మండలంలో 3 ఎకరాల లోపు ఉన్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం యాసంగి పంటలకు పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా పథకం నిధులు ఎకరాకు రూ.6 వేల చొప్పున 3 ఎకరాలలోపు ఉన్న రైతులు 10 వేల 248 మంది రైతులకు రూ.9కోట్ల 75లక్షల 51వేయి 158 రైతు భరోసా నిధులను రైతుల అకౌంట్లో ప్రభుత్వం జమచేసినట్లు మండల వ్యవసాయఅధికారి రవికుమార్ ప్రభాతవార్తకు తెలిపారు. ఇటిక్యాల మండలంలో 9వేల 8వందల 87మంది రైతులు ఉండగా అందులో 3ఎకరాలలోపు ఉన్న రైతులు 5 వేల 084 మంది రైతులకు రూ.5కోట్ల 23లక్షల 18,వేల 561లను, అలాగే ఎర్రవల్లి మండలంలో 10 వేల 134మంది రైతులు ఉండగా అందులో 3ఎకరాల లోపు ఉన్న రైతులు 5, వేల 164 మంది రైతులకు 4కోట్ల 52లక్షల 32వేల 597లను రాష్ట్ర ప్రభుత్వం రైతుల అకౌంట్ లలో జమ చేయడం జరిగిందని అంతేకాక మండలంలో 4ఎకరాలు ఉన్న రైతులకు ఈ వారంలో రైతు భరోసా నిధులు జమ చేసే అవకాశం ఉన్నట్లు మండల వ్యవసాయ అధికారి రవికుమార్ తెలిపారు.

## సాంకేతిక పరిజ్ఞానం నూతన ఆవిష్కరణలకు నాంది

### మండల విద్యాధికారి నిజాముద్దీన్

**కృష్ణ, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ , జిల్లా అధికారి గోవిందరాజులు ఆదేశాల మేరకు ప్రాథమిక పాఠశాల గుడెబల్లూరులో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఆధారిత ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రాలో భాగంగా కంప్యూటర్ ల్యాబ్‌ను ఎంఈఓ నిజాముద్దీన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణేష్‌సింగ్ విద్యార్థులచే ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు శోభారాణి, శ్యామల, సుష్మ, రుషిక, కుమారి, కళ్యాణి, జిందాప్ప విద్యార్థులు పాల్గొన్నారు.



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

# బాల్య వివాహాలు జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి

**వనపర్తి టౌన్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** జిల్లాలో బాల్య వివాహాలు జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. ప్రధానమంత్రి 2015 జనవరి, 22న బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని ప్రారంభించి 10 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా జనవరి, 22 నుంచి మార్చి 8 వరకు మహిళా సాధికారత, అమ్మాయిల సంరక్షణ సాధికారత పై సంక్షేమ శాఖ ద్వారా జిల్లాలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుచున్నది. అందులో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలు పూర్తిగా అరికట్టడం, అమ్మాయిలకు రక్తహీనత నుండి విముక్తి కల్పించడం, మంచి విద్యాభ్యాసాలు అందించడం జరగాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుచున్నట్లు తెలిస్తే ఎవరైనా సరే వెంటనే 1098 టోల్ ఫ్రీ నెంబరుకి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. బాల్య వివాహాలు చేసే తల్లిదండ్రుల తో పాటు పెళ్లికి సహకరించే వారిపై, పెళ్లి చేసే అర్చకుడు లేదా ఖాజీ, పాస్టర్ల పై కేసులు నమోదు చేయడం జరుగుతుందనీ అవసరం అయితే బైండోవర్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. వనపర్తి జిల్లాలో ప్రతి వెయ్యి మంది పురుషులలో కేవలం 888 మంది మహిళలు మాత్రమే ఉన్నారని ఈ ఆంతర్యాన్ని క్రమంగా తగ్గించే ప్రయత్నంచేయాలని లైన్ డిపార్ట్మెంట్ అధికారులను ఆదేశించారు. అమ్మాయిల్లో రక్తహీనతను పారద్రోలడానికి వైద్యశాఖ, సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, చిన్న పిల్లల్లో సరైన ఎదుగుదల లేని పిల్లలను ఎన్.ఆర్.సి సెంటరుకు పంపించాలని ఆదేశించారు.



బేటి బచావో బేటి పడావో

ప్రచార గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్

**సుకన్య సమృద్ధి యోజన**

అమ్మాయిల చదువులు, పెళ్లి కొరకు కేంద్ర ప్రభుత్వం సుకన్య సమృద్ధి యోజన పథకం తెచ్చిందన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి అమ్మాయి పేరున తల్లిదండ్రులు సుకన్య సమృద్ధి యోజన చేసి ప్రతి నెల కొంత మొత్తం జమ చేస్తే అమ్మాయి యుక్త వయస్సు వచ్చేనాటికి ప్రతి సంవత్సరం 8.6 శాతం వడ్డీతో కలిపి ఇస్తారని ఇది చాలా పెద్ద మొత్తం వస్తుందని తెలియజేశారు. జిల్లాలోని ప్రతి తల్లిదండ్రులు సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకుని తమ అమ్మాయిల ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలకాలని కోరారు. అనంతరం బేటి బచావో బేటి పడావో ప్రచార గోడపత్రికలను ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు, అదనపు కలక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జి యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం, డిఎస్పీ కే. ఉమామహేశ్వర రావు, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, డి.సి.పి. ఒ రాంబాబు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీని నిలువరించడంలో కాంగ్రెస్ విఫలం: సిపిఎం

**గద్వాల, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** రాష్ట్రంలో విద్వేష రాజకీయాల ద్వారా బలపడాలని చూస్తున్న బీజేపీని నిలువరించడంలో కాంగ్రెస్ విఫలం అయిందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యం.వి రమణ అన్నారు. సోమవారం అల్లంపూర్ చౌరస్తాలో జి.కే. ఈదన్న అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈసందర్భంగా మాట్లాడుతూ విభజన విద్వేష రాజకీయాలతో తెలంగాణ ప్రజలను విడదీసే ప్రయత్నం చేస్తున్న బిజెపిని నిలువరించడంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ విఫలం అయిందని అన్నారు. బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిన కేంద్రానికి వ్యతిరేకంగా పోరాటం చేయడం లేదన్నారు. క్వింటాల్ ధాన్యానికి 500నగదును బోనస్‌గా ఇస్తామని చెప్పిన కాంగ్రెస్‌పార్టీ ఇప్పటికీ రైతులఖాతాలలో ఎందుకు నగదును జమచేయలేదని ప్రశ్నించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక మిర్చి శనగ వంటి పంటలు పొలాలలోనే ఉన్నాయని అన్నారు. ఆర్థిక పరిస్థితి పేరుతో సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం చేస్తే ప్రజలను సమీకరించి ఉద్యమిస్తామని హెచ్చరించారు.గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని వెంటనే ప్రారంభించి, కూలీలకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి మాట్లాడుతూ కోట్లాదిరూపాయల ప్రజాధనంతో అలంపూర్ చౌరస్తాలో ఏరియా ఆసుపత్రి నిర్మాణం పూర్తయిన ఇంకా ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. నియోజకవర్గ వాసులకు అందుబాటులో ఆసుపత్రి ఉన్నా,కర్నూల్‌కు వెళ్లాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఎందుకు తీసుకు వచ్చారో పాలకులను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ ఏడాది ఒక్క అలంపూర్ నియోజకవర్గంలోనే 20 వేల ఎకరాల్లో రైతులు శనగ పప్పును సాగు చేస్తే ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని, దీనివల్ల ఇక్కడి రైతులు ఆంధ్ర, కర్ణాటక, ప్రాంతాలకు తక్కువ ధరకు శనగ పప్పును అమ్మి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున తక్షణమే శనగ పప్పు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా మార్కెట్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన కందుల నగదును ఇప్పటివరకు రైతుల ఖాతాలలో జమ చేయలేదని, వెంటనే కంది రైతుల ఖాతాలలో నగదును జమ చేయాలని డిమాండ్ చేశారు. అలంపూర్ చౌరస్తాలో బస్టాండ్ నిర్మిస్తామని చెప్పిన పాలకుల హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీ ప్రాంతాలలో పేదలు ఇండ్లు, ఇళ్ల, స్థలాలు లేక అల్లాడుతుంటే అధికార అండదండలతో అనధికారికంగా ప్రభుత్వ స్థలాలు, 10శాతం ల్యాండ్స్ కబ్జాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. తుంగభద్ర నీటిని తుమ్మిళ లో నిల్వ చేయకపోవడం వల్ల తుమ్మిళ్ళ పథకం కింద ఉన్న భూములకు సాగునీరు అందడం లేదన్నారు. కావున నీటిని తుమ్మిళ్ల లో నిల్వ చేసిన తర్వాతే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కృష్ణ నీటిని పూర్తి స్థాయిలో అందించి సాగు త్రాగు సాగు నీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. జిల్లాలో రబీ సీజన్ కు సంబంధించి పంటలకు పూర్తిస్థాయిలో సాగు నీరు అందక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలంపూర్ తాలూకాలో ఆర్టీసి డిపో ఏర్పాటు చేసి, అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సులు తిప్పాలని అయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.రాజు ఏ.పరం జ్యోతి, ఉప్పేర్ నరసింహ, నర్మద, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు

# అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలుకుతారా

### సిపిఐ జిల్లా కార్యదర్శి వాగ్వాదం

**ఆత్మకూరు ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** మున్సి పల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని బాబా కాలనీలో మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలకు ఆత్మకూర్ పోలీసులు వత్తాసు పలకడం మానుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు పోలీసులతో సోమవారం వాగ్వాదం చోటు చేసుకోవడం విశేషం పట్టణంలోని బాబా కాలనీలో మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారంటూ గత గురువారం మున్సి పల్ కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో నిరవధిక ధర్నాకు పూనుకోగా ఆత్మకూరు మున్సి పల్ కమిషనర్ చికిని శశిధర్ సంఘటన స్థలాన్ని సందర్శించి పనులు నిలిపివేయాల్సి దిగా ఆదేశించారు. మళ్లీ సోమవారం నుండి యధావిధిగా పనులకు ఉపక్రమించడంతో సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు తమ అనుచరులతో కలిసి పనులను అడ్డుకునేందుకు ప్రయత్నించగా ఆత్మకూర్ పోలీసులు రంగంలోకి దిగి కోర్టు ఉత్తర్వుల మేరకు మేము నడుచుకుంటామని ఈ విషయంపై న్యాయస్థానంలో తెలుసుకోవాల్సిందిగా విజయరాములకు తెలిసి చెప్పారు. తాము కూడా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని పనులు నిలిపివేయాలంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ పోలీసులు ముందుండి అక్రమ నిర్మాణాలు చేపడతారా అంటూ విజయరాములు పోలీసులతో తీవ్రస్థాయిలో వాగ్వాదానికి దిగారు. ఏది ఏమైనా అక్రమ నిర్మాణాలను అడ్డుకుంటామని లేని పక్షంలో ఇక్కడే ఆందోళన కార్యక్రమాలకు పూనుకుంటామని తేల్చి చెప్పడంతో పోలీసులు శ్రుతిమిత్తగా మందలిస్తూ ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని కోర్టు ఆదేశాల మేరకు తాము మర్చిపోవాల్సి వస్తుందని హెచ్చరించడంతో మరోమారు ఆత్మకూరు మున్సి పల్ కార్యాలయం ముందు ఆందోళనకు పనుకుంటామని నేతలు అక్కడి నుండి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి తో పాటుగా సిపిఐ నాయకులు భాస్కర్, అబ్రహం, కుతుబ్ ,రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్ పోలీసులతో వాగ్వాదానికి

దిగిన సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు

# ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఐక్యమత్యంతో నిర్వహించుకోవాలి

**పాన్‌గల్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** గ్రామాలలో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలను కులమతాలకు అతీతంగా ఐకమత్యంతో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని దవాజిపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి పార్వతీ పరమేశ్వరుల విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమానికి గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దూరంగా ప్రతిష్టించిన విగ్రహాలకు ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... ఆలయంలో ఉన్న సీసీ కెమెరాల పరిశీలించి, సెంట్రల్ లాక్ ఉద్దేశాన్ని అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వోద్దని సూచించారు. గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులది అయినప్పటికీ గ్రామాలలో ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. ముఖ్యంగా గ్రామాలలో యువత చెడు దారి పట్టకుండా తల్లిదండ్రులు కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. గ్రామంలో అందరూ ఐక్యమత్యంతో ఉంటూ సోదరభావంగా మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాన్‌గల్ ఎస్సై, శ్రీనివాసులు, విగ్రహదాత ఏ నాగేశ్వరరావు ,గ్రామ పెద్దలు ,యువకులు ,మహిళలు ,పోలీస్ సిబ్బంది తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



విగ్రహాల ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎస్‌పి రావుల గిరిధర్

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: మండల విద్యాధికారి

**చిన్నచింతకుంట,ఫిబ్రవరి24 ప్రభాతవార్త:** జాతీయ గ్రీన్‌కార్ప్స్, తెలంగాణ జాతీయ గ్రీన్ కార్ప్స్ వారి నిర్వహణలో భాగంగా పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ ,విద్య అమలులో భాగంగా సోమవారం మండలంలో లాల్‌కోటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పాఠశాల విద్యార్థులచే పర్యావరణ పరిరక్షణ నినాదాలతో ప్లకార్డ్స్‌తో గ్రామ ప్రజలకు అవగాహన కలిగించుటకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల విద్యాధికారి జిహెచ్‌ఎం పి.మురళీకృష్ణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని ఆయన తెలిపారు .పాఠశాల పచ్చదనం పరిశుభ్రత,ఆవశ్యకతను పాఠశాలస్థాయి నుండి విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలని ఆయన తెలిపారు. 2001 నుంచి ఎన్జీసి కార్యక్రమాలు పాఠశాలలో అమలు చేస్తున్నారని, ఎన్జిసికి మన పాఠశాల ఎన్నిక కావడం మరింత బాధ్యతను పెంచిందన్నారు. పాఠశాలలో పచ్చదనాన్ని న్యూట్రి గార్డెన్‌ని పెంచిన ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందించారు.పర్యావరణ విద్యలోభాగంగా నిర్వహించిన ఉపన్యాస, చిత్రలేఖన పోటీలలో ఉత్తమంగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పర్యావరణ కార్యక్రమాలలో ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. గ్రామాన్ని, పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుతున్న గ్రామ పారిశుద్ధ కార్మికులను ఎంఈఓ శాలువాతో సత్కరించారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ఎన్జిసి ఇన్చార్జ్ ఉపాధ్యాయులు శివకుమార్,గంగయ్య, రాజశేఖర్, శ్రీనివాసులు, రాఘవేందర్, సుజాతమ్మ, జయలక్ష్మి, సుమన తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్మికులను సన్మానిస్తున్న ఎంఈఓ

# శ్రీ శ్రీశైలం మల్లన్న స్వామికి చేనేత పట్టు వస్త్రాలు

**అమరచింత, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** శ్రీ శ్రీశైలం మల్లన్న స్వామి బ్రహ్మోత్స వాల సందర్భంగా అమరచింత పట్టణానికి చెందిన చేనేత కార్మికులు శ్రీశైలం దేవస్థానంలో వారం రోజులుగా నియమ నిష్టాలతో తయారుచేసిన చేనేత పట్టు వస్త్రాలను సోమవారం అమరచింత పట్టణానికి చెందిన ప్రముఖ చేనేతపట్టు వస్త్రాల వ్యాపారి మహంకాళి శ్రీనివాసులు దంపతులు శ్రీ శైలంలో చేనేత పట్టు వస్త్రాలకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అలాగే శ్రీశైలంలో పద్మశాలి సంబంధించిన సత్రం నుండి పట్టు వస్త్రాల ఊరేగింపు బాజా భజంత్రీల మధ్య దేవస్థాన కమిటీకి పట్టు వస్త్రాలను అప్పగించారు. గత 11 ఏళ్లుగా శ్రీశైలం మల్లన్న స్వామికి అమరచింత చేనేత కార్మికులు నియమనిష్టాలతో తయారు చేయడం పట్ల చేనేత కార్మికులను మహంకాళి శ్రీనివాసులు అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం దేవాలయ కమిటీ సభ్యులు కర్నాటి శ్రీధర్, అమరచింత పట్టణ చేనేత కార్మికులు మహంకాళి ,సత్యనారాయణ, మహంకాళి, ఎల్లప్ప ,మహంకాళి, విష్ణు తదితరులు ఉన్నారు.



పట్టు వస్త్రాలను అప్పగిస్తున్న మహాకాళి శ్రీనివాసులు దంపతులు

## ఏఐ ప్రోగ్రామింగ్ ప్రాజెక్ట్‌కు ఎంపికైన కర్ని ప్రాథమిక పాఠశాల

**మక్తల్ టౌన్, ఫిబ్రవరి 24ప్రభాత వార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ) ప్రోగ్రాంకు పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా నారాయణపేట జిల్లాలో 10 పాఠశాలలు ఎంపిక కావడం జరిగింది. అందులో భాగంగా మక్తల్ మండలం నుండి ఎంపికైన ప్రాథమిక పాఠశాల కర్నిలో కలెక్టర్ ఆదేశానుసారం ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ప్రోగ్రాం ను మండల విద్యాధికారి అనిల్ గౌడ్ కర్ని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య గౌడ్ ప్రారంభించారు. ఆయనతో పాటు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ గాయత్రి, ఉపాధ్యాయులు డి.వెంకటేష్, రమ్య, ప్రతిభ, కల్పన విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## అదనపు కలెక్టర్‌కు ఘనంగా వీడ్కోలు పలికిన ఐ.డి.ఓ.సి ఉద్యోగులు






అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి టౌన్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లాలో సంచిత్ గంగ్వార్ అదనపు కలెక్టర్ స్థానిక సంస్థల బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రశంసించారు. 16 డిసెంబర్, 2023 నుండి అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్‌గా బాధ్యతలు నిర్వర్తించిన సంచిత్‌గంగ్వార్ ఈ నెల 21న అదనపు కలెక్టర్ గా నారాయణ పేటకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం వనపర్తి ఐ.డి.ఓ.సి సమావేశ మందిరంలో సంచిత్ గంగ్వార్‌కు ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో గాని స్థానిక సంస్థల నిర్వహణలో గాని చాలా బాగా పనిచేశారని కొనియాడారు. జిల్లా కలెక్టర్ తరఫున, రెవెన్యూ, జిల్లా అధికారులు, మండల అధికారుల తరఫున సంచిత్‌కు శాలువాలు, పూల మొక్కలతో ఘనంగా సన్మానం చేసారు. బదిలీ పై వెళుతున్న సంచిత్ గంగ్వార్ మాట్లాడుతూ పోస్టింగ్ తీసుకున్నాక మొదటగా వనపర్తి జిల్లాలో విధులు నిర్వహించడం జరిగిందని,చాలావిషయాలు నేర్చుకోవడం జరిగిందన్నారు. అధికారులు అందరూ బాగా పనిచేసి సహకరించడం వల్ల సమర్థవంతంగా పనిచేయడం జరిగిందని తెలిపారు.

## భక్తి శ్రద్ధలతో ఇరుముడి పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**వెల్దండ, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని బుధవార్‌పేట ఆంజనేయ స్వామి దేవాలయంలో శివ మాల ధరించిన స్వాములు సోమవారం దేవాలయాలలో శివ స్వాముల ఇరుముడి పూజాలు నిర్వహించారు. కార్యక్రమానికి వెల్దండ గ్రా మ మాజీ సర్పంచ్ యెన్నం భూపతి రెడ్డి, సింగిల్ విండో డైరెక్ట ర్ మట్ట వెంకటయ్య గౌడ్‌లు పాల్గొని శివుడికి అభిషేకాలు పూజ లు నిర్వహించి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. శివ మాలదారులు శ్రీశైలనికి బయలుదేరగా ఊరేగింపుగా స్వాములను మంగళహారతులతో శ్రీశైల పుణ్యక్షేత్రానికి పంపించారు.

## 8న జాతీయ లోక్ అదాలత్

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర వెల్లడి**

**మహబూబ్‌నగర్ ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** వచ్చేనెల మార్చ్ 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. పాపిరెడ్డి ఆదేశాల మేరకు జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా సోమవారం బ్యాంక్ మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇందిర మాట్లాడుతూ వచ్చే నెల మార్చి 8న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక మొత్తంలో బ్యాంక్ ప్రి లిటిగేషన్ కేసులను పరిష్కరించుకోగలరని, కోర్టులో పెండింగ్ లో ఉన్న బ్యాంక్ సంబంధిత సెటిల్మెంట్‌కు గుర్తించబడిన కేసులను జాతీయ లోక్ అదాలత్ లో పరిష్కారం చేసుకోవచ్చని చెప్పారు కక్షిదారులను ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తప్పకుండా వారి కేసులలో హాజరయ్యేవిధంగా కృషి చేయాలని అన్నారు.

## గుండాలలో అన్నదాన ఏర్పాట్ల పరిశీలన

**వెల్దండ, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:**వెల్దండ మండల పరిధిలోని గుండాల శ్రీ అంబ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 26 నుండి 15 రోజుల పాటు నిర్వహించనున్న అన్నదాన ఏర్పాట్లను అన్నదాత, కాంగ్రెస్ పార్టీ నాయకులు, జియాగూడ యాదవ సంఘం అధ్యక్షులు జక్కుల చిన్న జంగయ్య యాదవ్ సోమవారం ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం సైతం గుండాల ఆలయం వద్ద ప్రతిరోజు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. దేవాలయ అభివృద్ధికి రూ.10 లక్షలతో ప్రకార మండపం ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి సంవత్సరం అన్నదానంతో పాటు ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ వైస్ చైర్మన్ అరుణ్‌నాయక్, నిర్వాహకులు సింహారెడ్డి, మండలి శ్రీను, మల్లేష్ యాదవ్, ఆలయ పూజారులు శివ, సంతోష్, నరహరి, సురేష్ తదితరులు ఉన్నారు.



అన్నదాన ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం

## వైభవంగా ప్రారంభమైన వార్షిక బ్రహ్మోత్సవాలు

**కల్వకుర్తి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:**కల్వకుర్తి పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో కొలువైన శ్రీ లక్ష్మి పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమ య్యాయి. మొదటి రోజు సుప్రభాత సేవ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, పారాయణాలు, అనంతరం స్వామి వారి ఎదురుకోళ్ల కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అదే విధంగా స్వామివారి పవళింపు సేవా కార్యక్రమం ఘనంగా నిర్వహించినటున్ల దేవాలయం చైర్మన్ కల్వ మనోహర్, దేవాలయం కమిటీ, భక్తి బృందం సభ్యులు తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, బోజన ప్రసాదాలు వితరణ చేసినట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు సహాయ సహకారాలు అందించిన దాతలను దేవాలయం చైర్మన్,భక్తిబృందం కమిటీసభ్యులు ఘనంగా శాలువా కప్పి వేంకటేశ్వర స్వామి ప్రతిమ బహుకరించి ఘనంగా సన్మానం చేశారు.



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

## ఆన్లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**ప్రధాన కూడళ్ళలో అవగాహన కార్యక్రమం**

**నవాబుపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు డిజిటల్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలని, సోమవారం నవాబుపేట కేంద్రంలో ఎస్సై విక్రం అవగాహన సదస్సు నిర్వహించారు. అనామకుల నుండి ఫోన్ కాల్ వస్తే సైబర్ నేరగాళ్ల నుండి వచ్చిందని గుర్తుంచుకోవాలన్నారు. సోషల్ మీడియాను అదునుగా చేసుకుని సైబర్ నేరగాళ్లు యువత, సీనియర్ సిటిజన్, విద్యార్థులు అన్ని వర్గాల వారిని టార్గెట్ చేసుకుని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. వ్యక్తిగత ఫోటోలను సోషల్ మీడియాలో పెట్టకూడదని, గుడ్డిగా అపరిచిత వ్యక్తులు సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులను నమ్మకూడదని తెలిపారు. ఏదైనా సైబర్ క్రైమ్ జరిగితే వెంటనే 1930 కు ఫోన్ కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ క్రైమ్ జరిగిన గంట వ్యవధిలో (గోల్డెన్ అవర్)లో ఫిర్యాదు చేసినట్లయితే నగదు సీజ్ చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అనంతరం అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు అడిగిన ప్రశ్నలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ జనార్ధన్, ఆంజనేయులు కానిస్టేబుళ్ల ఖాజ సిరాజుద్దీన్, లోకేష్, అశోక్ గౌడ్ యువకులు పాల్గొన్నారు.



ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం

**చిన్న చింతకుంట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమవారం మండల పరిషత్ సమావేశ హాల్ లో ఎన్నికల అధికారి ఎంపీఓ అనిల్ కుమార్ సమక్షంలో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షులు మహేష్ (పిఎస్‌ఉంద్యాల)ఉపాధ్యక్షులు రాజు (పిఎస్ లాల్ కోట) ప్రధాన కార్యదర్శిగా నవీన్ కుమార్ రెడ్డి (పిఎస్ దమగ్నాపూర్ )కోశాధికారిగా జ్యోతి (పిఎస్ వడ్డేమాన్) మీడియా ఆర్గనైజర్‌గా మధుసూదన్ రెడ్డి (పిఎస్ గోప్య నాయక్ తండ)లను ఎన్నుకున్నారు. వీరితోపాటు సలహాదారులుగా ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సుష్మ,సంతోష్,నర్సింలు,విష్ణు,జ్యోతి,కురుమన్న,చెన్నకేశవులు, సత్యవతి ,అన్వేష, సాధత్ అలీలను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల మండల అధ్యక్షులు మహేష్ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు హక్కులకై అందరితో కలిసి పోరాటం చేస్తామని ఆయన తెలిపారు.కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి,కంప్యూటర్ ఆపరేటర్ రఘు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం

## జూనియర్ కళాశాలలో ఘనంగా వీడ్కోలు


**పెబ్బేరు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** పెబ్బేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం రోజు ఇంటర్ రెండవ సంవత్సరం విద్యార్థులకు మొదటి సంవత్సరం విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఫేర్వెల్ పార్టీ కార్యక్రమానికి కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఓబుల్ రెడ్డి అధ్యక్షత వహించారు. విద్యార్థులు కళాశాలలో చేరి చదువుకోవడం రెండు సంవత్సరాలు అనుబంధాన్ని గుర్తు చేసుకొని అధ్యాపకుల యొక్క బోధన పద్ధతులు అధ్యాపకుల యొక్క కృషి గురించి పాఠ్యాంశాల విషయాల గురించి తమ ఉపన్యాసాలతో తెలియజేశారు. రెండు సంవత్సరాలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకొని అధ్యాపకులతో జూనియర్ విద్యార్థులతో మంచి అనుబంధం నేర్పరచుకొని వెళుతున్నందుకు చాలా బాధగా ఉందని రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఆవేదన బాధ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ మార్చిలో జరిగే అన్యువల్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించి కళాశాలకు, అమ్మ నాన్నకు, మీ ఊరికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించడం జరిగింది. కష్టపడే తత్వం ఉన్న విద్యార్థులు కచ్చితంగా ఫలితాలను సాధిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపల్ ఓబుల్ రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



వీడ్కోలు సమావేశంలో విద్యార్థులు అధ్యాపక బృందం

## ఫిర్యాదుల పట్ల వెంటనే చర్యలు చేపట్టాలి

**గద్వాల, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** భాధితుల నుండి వచ్చిన ఫిర్యాదుల పట్ల వెంటనే స్పందించి చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు పోలీస్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 10 మంది బాధితుల ఫిర్యాదులను జిల్లా ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూ వివాదాలకు సంబందించిన ఫిర్యాదులు, కొడుకులు తల్లిదండ్రులను చూడకపోవడం, అన్నదమ్ముల మధ్య బాగా పరిష్కార ఫిర్యాదులు, లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులు, భర్త వేదింపులకు సంబంధించిన ఫిర్యాదులను ఎస్పీ పరిశీలించారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత ఎస్సై లను, సీ.ఐ లను జిల్లా ఎస్పీగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్పి వై.మోగిలయ్య పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాస్‌రావు

# సింథటిక్ కెమికల్స్ అనుమతులను రద్దు చేయాలి

**చిన్న చింతకుంట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** చిత్తనూర్ ఇథనాల్ కంపెనీకి అనుబంధంగా సింథటిక్ కెమికల్స్ కంపెనీకి ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్‌తో సోమవారం చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు ఏక్లాస్‌పూర్ రైతు మండలి నాయకులు బండారి మల్లేష్ అధ్యక్షత వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా తెలంగాణ పీపుల్స్ జాక్ నాయకులు రవిచంద్రకు హాజరై ప్రారంభించారు. ఈ ధర్నానుద్దేశించి రవిచంద్ర మాట్లాడుతూ చిత్తనూరు విత్తనాలు కంపెనీకి అనుబంధంగా ఏర్పాటు చేస్తున్న సింథటిక్ కెమికల్స్ అనే పరిశ్రమను ప్రజాభిప్రాయ సేకరణ జరుపకుండా ఏర్పాటు చేయడం అక్రమం అప్రజాస్వామికమని వెంటనే ఆ కంపెనీని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పాలమూరు జిల్లా అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి మాట్లాడుతూ పాలకులు గత బిఆర్ఎస్ అయిన నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన జిల్లా రైతాంగం పై కక్షగట్టి ప్రవర్తిస్తున్నారని ఇక్కడి భూములు చౌకగా పరిశ్రమల పేరుతో పెట్టుబడుదారులకు ఇస్తున్నారు తప్పితే ఈ బీడు భూములకు నీళ్ల పారించడం లేదని కోయిల్ సాగర్ ,భీమా, పాలమూరు రంగారెడ్డి, నారాయణపేట, కొడంగల్ లాంటి ప్రాజెక్టులను పూర్తి చేయకుండా జిల్లా ప్రజలను నిలువునా ముంచుతున్నారు. ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.చక్రవర్తి మాట్లాడుతూ గతంలో ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలనే పోరాటంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు నేడు ఎమ్మెల్యేలుగా మారారు కానీ పోరాడిన రైతులేమో రౌడీలుగా ముద్ర వేయబడ్డారని ఇది ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విత్తనాలు కంపెనీని రద్దు చేయడానికి పూనుకోకపోతే వారికి భవిష్యత్తు ఉండదని హెచ్చరించారు. టిఎఫ్‌టియు రాష్ట్ర కార్యదర్శి ఖలీల్ మాట్లాడుతూ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాటం రాష్ట్ర వ్యాప్తంగా ప్రేరణ ఇచ్చిందని దీనిని ఆదర్శంగా తీసుకునే స్థంభంపల్లి, దిలావర్పూర్ ప్రజలు పోరాడి అక్కడ కంపెనీలను రద్దు చేయించే వరకు నిరంతరంగా పోరాటాన్ని కొనసాగించారని తెలియజేశారు. ఒకవేళ నేటి పాలకులు ఆ కంపెనీని రద్దు చేయకపోతే ఈ పోరాటమే వాళ్ళ మెడకు చుట్టుకుని మళ్లీ టిఆర్ఎస్‌కు పట్టిన గతే వీళ్లకు పట్టేటట్లు చేస్తుందని హెచ్చరించారు. కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో తహసిల్దార్ ఎల్లన్నకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు ఈ కార్యక్రమంలో టిఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి యాదగిరి నాయకులు మన్నెంకొండ మహాదేవ్ శాంతమ్మ రైతులు జయరాం రెడ్డి, శ్రీను, మున్నా, సవారి రవి రెడ్డి, రైతు మండలి నాయకులు రామచంద్రయ్య, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పృథ్వి తదితరులు పాల్గొన్నారు.



తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

# కొడంగల్ నియోజకవర్గంలో బందు ప్రకటిస్తాం

**ఎల్లప్పకు న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతాం :మాజీ జడ్పిటిసి కోట్ల మైపాల్ ముదిరాజ్**

**మద్దూర్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా ఉమ్మడి మద్దూరు మండల పరిధిలోని అల్లిపూర్ గ్రామానికి చెందిన కావలి ఎల్లప్పపై 17వ తేదీ రోజు జరిగిన దాడిని ఖండిస్తూ సోమవారం మద్దూర్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. దౌల్తాబాద్ మాజీ జడ్పిటిసి కోట్ల మైపాల్ ముదిరాజ్ మాట్లాడుతూ ఎల్లప్పకు న్యాయం జరగకపోతే కొడంగల్ నియోజకవర్గంతో పాటు తెలంగాణ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా ఆయన అన్నారు.మద్దూర్ ఎస్సై, కోస్గి సీఐపై చర్యలు తీసుకోకుండా అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఎల్లప్పను గొడ్డును బాదినట్లు బాది మాకు ఏమీ తెలియదు అంటూ అధికారులు చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారని, ముదిరాజ్ కులానికి చెందిన ఎల్లప్పను చిన్నచూపు చూడటం సరికాదని విమర్శించారు. అల్లిపురం గ్రామానికి చెందిన అధికార పార్టీకి చెందిన ఆ నాయకునిపై వెంటనే కేసు నమోదు చెయ్యకుంటే, ఎస్పీ, ఐజి దగ్గరికి బీసీ సంఘాలు అన్నీ కలిసి వెళ్తామని తెలియజేశారు. మద్దూర్ మాజీ ఎంపీటీసీ సిపిరి వెంకటయ్య మాట్లాడుతూ పోలీస్ అధికారులు నాయకులకు కొమ్ముకాస్తూ అహంకారం చెబుతున్నారని, ఆయా శాఖ అధికారులు ప్రతి రోజు ఎవరెవరితో మాట్లాడుతున్నారో ,వారి ఫోన్ కాల్ డాటా తీసి ఆ తరువాత వారికి తగిన గుణపాఠం చెప్తామని అధికారులను హెచ్చరించారు. ముదిరాజుల దగ్గరికి వస్తే ఎవరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ఒక్కొక్కరిని గుడ్డలు ఊడదీసి ఏ రాజకీయ నాయకుడైన సరే వదిలిపెట్టబోమని అన్నారు. ఎల్లప్పకు నలుగురు ఆడపిల్లలు,వారి ముఖం చూసి కూడా వదిలిపెట్టకుండా కాళ్లపై బూటు కాళ్లతో తొక్కుతూ తోలు బెల్ట్‌తో కొట్టడం ఎంతవరకు సమంజసమని అధికారులను సూటిగా ప్రశ్నించారు. మద్దూర్ పోలీస్ స్టేషన్‌లో కొట్టింది కాకుండా ఇక్కడి నుంచి కోస్గి పోలీస్ స్టేషన్ తరలించి అక్కడ కొట్టడం ఇది ఎంతవరకు న్యాయమని, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పుతూ కొట్టడం అది మీకే నచ్చిందని పోలీసులను సూటిగా అడిగారు. అనంతరం బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు భవాని శంకర్‌చారి మాట్లాడుతూ ఒక బీసీ బిడ్డను కొట్టడం ఎంతవరకు పోలీసులకు న్యాయం అనిపించిందని ఈ సందర్భంగా అన్నారు. ఒక నాయకుడు ఫోన్ చేసి చెప్తే ఎవరినైనా లాటీలతో పోలీసులు కొడతారా అని ప్రశ్నించారు. అధికారులను సస్పెండ్ చేసే వరకు మేము పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు, బందులు ప్రకటిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు, యూనివర్సిటీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముదిరాజ్ సంఘం నాయకులు

# ఔటర్ రింగ్ రోడ్డు అడ్డాగా ఇసుక దందాలు

**మొదటి పేజీ తరువాయి భాగం..**

కొనసాగిస్తున్నారు.కాగా వీరు అంతుచిక్కనిమోసగాళ్ళు వీరిని ఎవరైనా సంబధితశాఖఅధికారికానీ పోలిస్‌కానీ ప్రశ్నిస్తే అన్ని ప్రభుత్వ ఆన్‌లైన్ నిబంధనల ప్రకారం మేము ఇసుకబుకింగ్ చేశాము, అదేబుకింగ్ ఇసుకలోడ్‌ను తీసుకెళ్తున్నాను అన్నట్టుగానే వుంది.లోతుగా ఆరాతీస్తే అసలు మోసాలు బయటపడుతాయి. కానీ ఏ అధికారి కూడ మోసం ఎక్కడ జరుగుతుంది, సామాన్య ప్రజల నిత్య అవసరమైన ప్రకృతివనరులలో ఒక్కటైనా ఇసుక ను కూడా సామాన్యుడు కొనలేని పరిస్థితి ఎందుకు వచ్చింది అని లోతుగా పరిశీలనచేసి ఈఅక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు అధికా రులు కానీ ప్రజా ప్రతినిధులు కాని ముందుకు రాకపోవడం గమనార్హం.

**వ్యాపారంలో మోసాలు....** ఇసుక ఆన్ లైన్ బుకింగ్ చేసిన అడ్రస్ ఒకటీ వుంటే డెలివరి మరొక చోట వుంటుంది. అసలు యజమాని పేరు ఒకటి వుంటే మరొక ఇంటి యజమాని పేరుగల నిర్మాణం దగ్గర ఇసుకను దింపుతారు. ఒకే బుకింగ్ పై రెండు ట్రిప్పులను కూడా తెప్పించుకునే సమర్థులు వున్నారు. ఆన్ లైన్ బుకింగ్ సెల్ ఫోన్ మేసేజ్ లను, బుకింగ్ ఆర్థర్ స్లిప్ లను పరిశీలిస్తే వీరి మోసాలు బయట పడుతాయి. అధిక ధరలకు అమ్మకాలు. ప్రస్తుతము గద్వాల పట్టణం, పరిసర గ్రామాలకు వచ్చే ఇసుక ట్రాక్టర్లు వందల సంఖ్యలో వుంటాయి. వీటిలో నిజమైన ఇంటి యజమాని ఆన్ లైన్ బుకింగ్ పదుల సంఖ్యలో వుంటాయి. మిగతావి అన్ని కూడా మధ్యవర్తులు బుకింగ్ చేసుకున్న ట్రాక్టర్లే వుంటాయి. ఈ ఇసుకా మాఫియా మోసాల వల్ల సామాన్యులు ఇసుకను కొనలేని పరిస్థితి నెలకొంది. ఈ అధిక ధరల నుండి విముక్తి కల్పించి నాణ్యమైన ధరలకు ఇసుక సామాన్యునికి ఇసుక చేరువయ్యేలా చూడాలని ప్రజలు వేడుకుంటున్నారు.

**"మాఫియా అడ్డాలు"..** ఇసుకమాఫియా మయగాళ్ళ ఆట కట్టాలంటే, వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సంబధిత అధికారులు, పోలీసులు తనిఖీలు ముమ్మరం చేయాలి. గద్వాల పట్టణ శివారు ప్రాంతాలైన ఐజ రోడ్డు లో గల ఔటర్ రింగ్ రోడ్డు, జమ్మిచేడు గ్రామ సమీప రోడ్డు, సంగాల పార్క్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చెస్తే అక్రమ వ్యాపారుల చిట్టా బయట పడుతుందని పలువురు వ్యక్తం చేస్తున్నారు. సంఘాల, గొన్ పాడు, జమ్మిచేడు, గద్వాల తదితర ప్రాంతాల వారు ఈ అక్రమ వ్యాపారంలో కురువృద్దులని తెలుస్తుంది.

# ఆధార్ కార్డు అన్ని సేవలకు కీలకం :జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** ఆధార్ కార్డు అన్ని సేవలకు కీలకమైనదిగా మారిందని, ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు కలిగి ఉండి, తమ వివరాలు, బయోమెట్రిక్‌ను నవీకరించుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. హైదరాబాద్ నుండి వీ.సీ ద్వారా యుఐడిఏఐ డిప్యూటీ డైరెక్టర్ చైతన్య రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు, పౌర సేవలు పొందాలంటే ఆధార్ అప్ డేట్ తప్పనిసరి అని అన్నారు. ఆధార్ ఆధారంగా కొనసాగుతున్న సేవలను భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్డు వివరాలు పునరుద్ధరించుకోవాలని పేర్కొన్నారు. పుట్టిన శిశువు మొదలుకుని ఐదేళ్ల లోపు చిన్నారులందరికి తప్పనిసరిగా తల్లిదండ్రులు ఆధార్ నమోదు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. 5 నుంచి 15 సంవత్సరాల లోపు గల ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్డేట్ చేయించాలని సూచించారు. ఆధార్ కార్డులో చిన్న మార్పులకు నివాస ధృవపత్రం సరిపోతుందని, అయితే జన్మతేదీ సవరణకు తప్పనిసరిగా జన్మ ధృవపత్రం అవసరం అని స్పష్టం చేశారు. జన్మ ధృవపత్రాల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్లు మరియు ఆర్డీఓ కు ఆదేశించారు. విద్యార్థులు అధార్ కార్డు కోసం నమోదు చేసుకునే ముందు, వారి ఆధార్ వివరాలు సక్రమంగా ఉండేలా చూడాలని సూచించారు. పాఠశాలల్లోని విద్యార్థులందరి ఆధార్ బయోమెట్రిక్ ను అప్ డేట్ చేయించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. తద్వారా భవిష్యత్తులో జేఈఈ,నీట్ వంటి పరీక్షలు రాసే సమయంలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తవని సూచించారు. ఆధార్ నమోదు, అప్‌డేట్ కోసం మెగా క్యాంపులు నిర్వహించాలని సూచించారు. ఈ నవీకరణ ప్రక్రియకు సంబంధించి ఆధార్ సేవా కేంద్రాలకు తగిన చర్యలు తీసుకోవాలని ఈ డిస్ట్రిక్ మేనేజర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాసరావు, ప్రాజెక్టు మేనేజర్ నరేష్, ఈ.డీఎం శివ, డీఎంహెచ్ఓ సిద్ధప్ప, లీడ్ బ్యాంకు మేనేజర్ అయ్యప్ప రెడ్డి, డీడబ్ల్యుఓ సునంద, మున్సిపల్ కమిషనర్లు, మీసేవ ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ సంతోష్

## బాలికలు చదువు పట్ల శ్రద్ధ వహిస్తే ఉన్నత స్థాయికి చేరుకుంటారు


**పాన్‌గల్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** బాలికలు చదువు పట్ల శ్రద్ధ వహించి రానున్న వార్షిక పరీక్షల్లో ర్యాంకులు సాధించి పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ. బాలికలపాఠశాలలో ఏర్పాటుచేసిన వార్షికోత్సవ వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాలికలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన తిలకించారు. అనంతరం మాట్లాడుతూ సమాజంలో మహిళలు పురుషుల కన్నా ఎందులోనూ తీసి పోరని వారితో సమానంగా అన్ని రంగాలలో రాణిస్తున్నారని మీరు కూడా చదువు పట్ల శ్రద్ధ వహించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆయన కోరారు. అలాగే బాల్యవివాహాల పై మీ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం బాలికలకు ఉన్నత చదువుల కోసం అనేక సౌకర్యాలు కల్పిస్తుందని ప్రతి ఒక్కరు ప్రభుత్వం అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రాము యాదవ్ ,మాజీ ఎంపిటిసి హైమావతిలను నిర్వాహకులు సన్మానించారు.



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న కేజీవీబీ విద్యార్థినులు

## జిల్లా టాపర్‌గా అక్షర విద్యార్థిని

**మక్తల్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** ఇటీవల జరిగిన పూసల్ పహాడ్ టాలెంట్ టెస్ట్‌లో మక్తల్ పట్టణంలోని అక్షర హై స్కూల్ విద్యార్థిని నక్షత్ర అసమాన ప్రతిభను కనబరిచి జిల్లా టాపర్‌గా నిలిచినట్లు ప్రిన్సిపాల్ రాఘవేందర్ రెడ్డి తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల విభాగంలో మొత్తం 120 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం నక్షత్రను పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు.



విద్యార్థినిని సన్మానిస్తున్న దృశ్యం

## స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన తోటి స్నేహితులు

**రూ.30 వేల ఆర్థిక సహాయం అందజేత**



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:**వెల్దండ మండల కేంద్రానికి చెందిన బస్సమోని శ్రీనివాసులు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. తోటి స్నేహితులు సోమవారం శ్రీనివాసులు కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసి రూ.30 వేల ఆర్థిక సహాయం అందజేశారు. శ్రీనివాసులు కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బి.శ్రీనివాస్,మల్లికార్జున్, కృష్ణారెడ్డి, అల్వాల్‌రెడ్డి, పాండు, అంతయ్య, మణిపాల్ రెడ్డి, శేఖర్, వెంకటేశ్వర్, తుంగకు మార్ తదితరులు పాల్గొన్నారు.

## గోశాలకు గోవుల తరలింపు

**చిన్నచింతకుంట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించుకున్న అనంతరం భక్తులు స్వామి వారికి కానుకల రూపేణా కోడెదూ డలను సమర్పించడం ఆనవాయితీ. భక్తులు సమ ర్పించిన కోడెదూడలను హన్వాడ మండలం చిన్నదర్పల్లిలోని శ్రీలక్ష్మి గోశాలకు నాలుగు గోవులను తరలించారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు బాదం వెంకటేశ్వర్లు, భక్తులు బాలరాజు, అర్చకులు శ్రీనివాసులు, గోవుల కాపరి నాగరాజు, ఆలయ సిబ్బంది ఉన్నారు.



## ఉత్సవ మూర్తులను అందజేత




ఉత్సవ మూర్తులను అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:**దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న గుండాల అంబరామలింగేశ్వర స్వామి దేవాలయానికి పంచ లోహంతో తయారు చేసిన శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను కల్వకుర్తి మాజీ కౌన్సిలర్ కుడుముల చైతన్య కిషోర్ రెడ్డిదంపతులచే ఆలయ అర్చకులు ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు, కళాశాపన బింబ చైతన్య సర్వకలన్యాసం, కళ హోమములు, రుద్రాభిషేకం నిర్వహించి పల్లకి సేవతో ఆలయ ప్రదక్షిణ చేసి దేవాలయానికి అందించారు.ఈసందర్భంగా ఆలయ అర్చకులు విగ్రహ దాతలను వేద ఆశీర్వచనం అందించారు.భక్తులకు అన్నదానకార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ తాలూకా కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు విజేందర్ రెడ్డి, దేవాలయ వైస్‌చైర్మన్ అరుణ్‌కుమార్,ఆలయఅర్చకులు శివకుమార్ శర్మ, సంతోష్‌శర్మ, నరహరి శర్మ, సురేష్‌శర్మతో ఉన్నారు.

## తప్పిన పెను ప్రమాదం

**పాన్‌గల్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** అతివేగంతో వెళ్తున్న కారు ప్రమాదానికి గురికాగా పెను ప్రమాదం తప్పింది. స్థానికుల వివరాల ప్రకారం సోమవారం మండల కేంద్ర సమీపంలోని కేఎన్‌ఆర్ గార్డెన్స్ వద్దా కారు ప్రమాదానికి గురికాగా అందులో ప్రయాణిస్తున్న ఏ ఒక్కరికి గాయాలు కాలేదు కాగా సమీపంలో ఉన్నట్రాన్స్ఫార్మర్ గోడకుతగిలి కారుఆగిపో వడంతో ఎలాంటి ప్రమాదం సంభవించ లేదు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. మద్యం సేవించి అతివేగంగా కారు నడపడమే ప్రమాదానికి కారణమని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు.



## జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షుడిగా ఉమర్

**నవాబుపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** జిల్లా కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ ఉపాధ్యక్షుడిగా కాకర్జాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఎండి ఉమర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఉమర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు మండల కాంగ్రెస్ నాయకులకు మాజీ డిసిసి అధికార ప్రతినిధి జనంపల్లి దుశ్యంత్‌రెడ్డికి మండల అధ్యక్షులు నీరటి రామచంద్రయ్యకు, కార్యకర్తలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తానని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.



## ఇరుముడితో శ్రీశైలానికి శివ స్వాములు

**చిన్నంబావి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త** :మండల పరిధిలోని పెద్దమారూర్ గ్రామంలో శ్రీశైల క్షేత్రానికి శివ స్వాములు ఇరుముడితో 41 రోజులు ఉపవాస దీక్షతో శివమాలను ధరించి సోమవారం గ్రామంలో శివాలయంలో ఇరుముడి ధారణ చేశారు. మొదటగా శివాలయంలో శివ స్వాములు భక్తిశ్రద్ధలతో శివలింగానికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం నిర్వహించారు. శివ స్వాములు గోత్ర నామాలతో పూజలు నిర్వహించి ఇరుముడితో మల్లికార్జున స్వామికి సంబంధించిన పూజా సామాగ్రి పసుపు, కుంకుమ, గంధం, విభూతి, కర్పూరం, టెంకాయలు, బియ్యం, బిల్వదళాలతో ఇరుముడి పూజా కార్యక్రమాన్ని జగ్గారి జనార్దన్ రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. బయలుదేరుతున్న శివ స్వాములకు కుటుంబ సభ్యులు గ్రామస్తులు భాజా భజంత్రీలు భజన కార్యక్రమాలు కోలాటాల మధ్య వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శివ స్వాములు పాల్గొన్నారు.

## పర్మిట్ లేని ట్రాక్టర్లను పట్టుకున్న ఎంవీఐ వాసుదేవ రావు

**పెబ్బేరు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** ట్రాఫిక్ నియమాలు పాటించకుండా ఇసుక తరలిస్తున్న 7 ట్రాక్టర్లను సోమవారం సీజ్ చేసి, 14 మంది ఓనర్లు, డ్రైవర్లపై పెబ్బేరు ఎంవీఐ వాసుదేవ రావు కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే వాహనాల చెకింగ్‌లో భాగంగా కొత్తకోట మండలం రాణిపేట దగ్గర వనపర్తికి చెందిన రెండు ఇసుక ట్రాక్టర్లు, పెబ్బేరుకు చెందిన ట్రాక్టర్లను పట్టుకున్నారు. అగ్రికల్చర్‌కు వినియోగించాల్సిన ట్రాక్టరును కమర్షియల్‌గా వాడుతున్నందుకు 1 ట్రాక్టరును, ఫిట్నెస్ సర్టిఫికేట్, పర్మిట్ లేనందున 3 ట్రాక్టర్లను, డ్రైవింగ్ లైసెన్స్ లేనందున మరో 3 ట్రాక్టర్లను పట్టుకొని వాటిని సీజ్ చేసినట్లు ఎంవీఐ తెలిపారు. అదేవిధంగా ఇసుక ట్రాక్టర్లకు సంబంధించి ట్రాఫిక్ రూల్స్ పాటించని 7 గురు ఓనర్లపై, వెహికిల్స్ నడుపుతున్న 7 గురు డ్రైవర్లపై మొత్తం 14 కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. రూల్స్ పాటించని ఎవరికైనా పనిష్మెంట్ తప్పసరిని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు రూల్స్ పాటించి వెహికిల్స్ నడపాలని సూచించారు.

## గ్రంథాలయాన్ని సందర్శించిన జిల్లా కార్యదర్శి

**పానగల్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని వనపర్తి జిల్లా నూతన కార్యదర్శి వెంకటయ్య సందర్శించారు. సోమవారం మండల కేంద్రంలో గల గ్రంథాలయ కార్యాలయాన్ని ఆయన సందర్శించి రికార్డులను గ్రంథాలయంలోని వసతులను పరిశీలించారు. జిల్లాలోని అన్ని గ్రంథాలయాలు సందర్శించడం జరుగుతుందని అందులో భాగంగానే నేడు పానగల్ గ్రంథాలయాన్ని సందర్శించినట్లు గ్రంథాలయాలలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకే తాను కృషి చేస్తానని తెలిపారు. గ్రంథాలయంకు ప్రతిరోజు వచ్చే వార్త పత్రికల, మేగజైన్లు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఉమ్మడి జిల్లా మొత్తానికి ఒకే కార్యదర్శి ఉండడం వలన ఇటీవల హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న తనకు వనపర్తి జిల్లా ఇన్చార్జిగా నియమించినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట సిబ్బంది, శ్రీనివాసులు ,తేజ గ్రంథాల ఇన్చార్జి ఇక్బాల్ తదితరులు ఉన్నారు.

## ఉత్కంఠ భరితంగా బండలాగుడు పోటీలు

**అయిజ, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త;** పట్టణంలో వెలసిన శ్రీశ్రీ తిక్క వీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో నిర్వహిస్తున్న రైతు సంబరాల్లో భాగంగా సోమవారం సీనియర్ విభాగంలో బండలాగుడు పోటీలు ఉత్కంఠ భరితంగా కొనసాగాయి. ఈ పోటీలను స్థానిక మాజీ మున్సిపల్ చైర్మన్ చిన్నదేవన్న కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారిలు మొదటి జతను ప్రారంభించారు. పోటీలలో 11 జతల ఎద్దులు పాల్గొన్నాయి. 20 నిమిషాల నిర్ణీత సమయంలో ఎక్కువ దూరం లాగిన ఎద్దులను విజేతలుగా నిర్ణయించారు. ఇందులో భాగంగా మొదటి బహుమతి ఖాజా హుస్సేన్ ఎద్దు జత పల్కం దొడ్డి గ్రామం రాయచూరు జిల్లా కర్ణాటక రాష్ట్రం వారు గెలుపొందారు, రెండో బహుమతి ఎస్బిఆర్ బుల్స్ షేక్ మహమ్మద్ షరీఫ్ ఏ నారాయణపురం గ్రామం అనంతపురం జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, మూడవ బహుమతి కందూరు రాంభూపాల్ రెడ్డి జత గుంపుర మాన్ దీన్నే గ్రామం సిరివెళ్ల మండలం నంద్యాల జిల్లా, నాలుగో బహుమతి ఐదో బహుమతి కె.వి.ఆర్ బుల్స్ ఎనిమెట్ల గ్రామం బాపట్ల జిల్లా, బీరంబుల్స్ కొత్తూరు పాణ్యం మండలం నంద్యాల జిల్లా వారు గెలుపొందారు. వీరికి బహుమతులు బహుమతి దాతలు, దేవాలయ కమిటీ సభ్యులు అందించారు. ఈ పోటీలను జిల్లా పరిసర ప్రాంత ప్రజలే కాకుండా ఆంధ్రప్రదేశ్ కర్ణాటక రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు పశు పోషకులు రైతులు తరలివచ్చారు.

## ఎమ్మెల్యే చొరవతో కంచిరావుపల్లి తండాకు బిటి రోడ్డు

**పెబ్బేరు, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం కంచిరావుపల్లి గ్రామ రైతులు, కంచిరావుపల్లి తాండ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా వేచి చూస్తున్నా బీటీ రోడ్డు కల మేఘారెడ్డి వల్లే సాధ్యమైంది. ఈ బీటీ రోడ్డు వలన కంచిరావుపల్లి గ్రామ వేల ఎకరాలకు దారి పడదం, తండా వాసులు ఎన్నో రకాలుగా ఇబ్బంది పడుతూ వర్షాకాలంలో ఎమర్జెన్సీ సమయంలో కూడా హాస్పిటల్‌కు కానీ పెబ్బేరు గానీ రావడం కోసం చాలా ఇబ్బంది కరంగా ఉండేది ఎమ్మెల్యే మేఘరెడ్డి ఎలక్షన్ సమయంలో మాట ఇచ్చి సంవత్సరం నర కాలంలోనే ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం జరిగింది. కంచిరావుపల్లి, తండా వాసులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేశారు. రోడ్డు పనులను పర్యవేక్షించిన పెబ్బేరు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు యం.రాజేష్, లక్ష్మణ్ నాయక్ ,బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ చలాన్లు త్వరగా చెల్లించాలి: ఎస్సై శేఖర్

**మహ్మదాబాద్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వాహనాల పైన ఉన్న పెండింగ్ చలాన్లను త్వరితగతిన చెల్లించాలని ఎస్సై శేఖర్‌రెడ్డి సూచించారు. ఆయన మాట్లాడుతూ నెంబర్ ప్లేట్ లేకుండా, నెంబర్ లేకుండా వాహనాలు నడపరాదని వాహనాలపైన చట్టపరమైన చర్య తీసుకోబడుతుందని తెలిపారు. ద్విచక్ర వాహనదారులందరూ హెల్మెట్ ధరించి వాహనం నడపాలని అలాగే మైనర్ పిల్లలకు వాహనాలు ఇచ్చినచో వాహన యజమాను పైన చట్టపరమైన చర్య తీసుకోబడుతుందన్నారు. వాహనం నడిపేటప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడవద్దని, కారులో వెళ్లేవారు సీటు బెల్ట్ ధరించి కారు నడపాలని అన్నారు. ప్రజలందరూ తమ వాహనాలపైన పెండింగ్ చలాన్లు అతి త్వరగా చెల్లించాలని ఇతర జాగ్రత్తలు పాటించాలని మహమ్మదాబాద్ ఎస్సై శేఖర్ రెడ్డి ప్రజలకు తెలియజేశారు.

## స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి

**ప్రజావాణిలో వినతి పత్రం ఇచ్చిన ఎస్సీ ఫెడరేషన్ సభ్యులు**


**శ్రీరంగాపూర్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :**మండలపరిధిలోని కంబాలపురం గ్రామం నుండి కంచిరావుపల్లి వెళ్లే రోడ్డులో తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు వాహనాల వేగం ఒక కారణం అని ఆలోచించినా శ్రీరంగాపూర్ ఎస్సీ ఫెడరేషన్ సభ్యులు కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో సోమవారం వినతి పత్రం ఇచ్చి ఆర్అండ్‌బి డిఈ నర్సింహారెడ్డి తో చర్చించి కంబలాపూర్ దగ్గర స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేసి ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా చూడాలని కోరారు. దీనిపై వారు సానుకూలంగా స్పందించడం జరిగిందని పేర్కొన్నారు. అదేవిధంగా వాహనదారులు కూడా మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని శ్రీరంగాపూర్ ఎస్సీ ఫెడరేషన్ సభ్యులు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ప్రేడరేషన్ వనపర్తి జిల్లా కన్వీనర్ బి.రమేష్ శ్రీరంగాపూర్ మండల కార్యదర్శి జె.లక్ష్మణ్, శ్రీరంగాపురం టౌన్ కన్వీనర్ కె.చంద్రయ్య, ఎస్సీ ప్రేడరేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మహిళా శవం లభ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** గుర్తు తెలియని మహిళా శవం లభ్యమైన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కేసరి సముద్రంలో సంఘటన వెలుగు చూసింది. సోమవారం కేసరి సముద్రంలో బతుకమ్మ ఘాటు దగ్గర మహిళా శవం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మహిళా శవాన్ని వెలికి తీశారు. మహిళా ముఖాన్ని చేపలు తినడంతో ఎవరు అనేది నిర్ధారణ కాలేదని పోలీసులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి సంబంధించి ఎవరికైనా వివరాలు తెలిస్తే పోలీసులను సంప్రదించాలని ఎస్సై గోవర్ధన్ తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## అంగన్వాడి సెంటర్‌లో 16వ వార్షికోత్సవం

**మూసాపేట్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** మూసాపేట మండల పరిధిలోని జానంపేట గ్రామంలో అంగన్వాడి కేంద్రంలో సోమవారము హెచ్‌బిఎల్ ఇంజనీరింగ్ వారి ఆధ్వర్యంలో భగీరథ బాలల వికాస కేంద్రం అంగన్వాడి 16వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు కల్చరల్ ఫిజికల్ యూనివర్సిటీ వారు బహుమతులను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌బిఎల్ కంపెనీ అధికారి యాదగిరి రెడ్డి మాట్లాడుతూ ఎస్‌బిఎల్



కంపెనీ 2008 నుండి మూసాపేట మండలంలో 32 అంగన్వాడి సెంటర్లను దత్తత తీసుకొని చిన్నారులకు పౌష్టికాహారం నిత్యం పాలు, అరటి పండ్లు, చిక్కి అందించడం జరుగుతుందని అలాగే చిన్నారులకు డిజిటల్ క్లాసుల కొరకై త్వరలో టీవీలు అంగన్వాడి సెంటర్లో ఏర్పాటు చేస్తామని అన్నారు. అంగన్‌వాడీలలో సపరేట్‌గ విద్యార్థులకు బాత్రూంలు కూడా నిర్మిస్తామని తెలిపారు. ప్రతి సంవత్సరం అంగన్‌వాడీ పిల్లలకు మూడు జతల యూనిఫామ్ ఇస్తున్నామని మా కంపెనీ వారు విద్యార్థుల కోసం అనేక రకాలుగా సేవలు చేస్తూనే ఉన్నాము ఇంకా ఏవైనా అంగన్‌వాడీలు మిగిలి ఉంటే దత్తత తీసుకొని నడిపించే ఆలోచన కంపెనీ వారు చేస్తున్నారని చెప్పారు. అనంతరం గ్రామస్తులు విద్యాశాఖ అధికారులు అంగన్వాడి టీచర్లు విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందిస్తూ సేవలు చేస్తున్నందుకు కంపెనీ వారిని అభినందించారు. ఈకార్యక్రమంలో మండల విద్యాధికారి రాజేశ్వర్ రెడ్డి ఏడబ్ల్యుసి సూపర్వైజర్ సుశీల, గ్రామ కార్యదర్శి మాధవి, కంపెనీ ఎంప్లాయ్ లక్ష్మణ్, గ్రామపెద్దలు అంగన్వాడి టీచర్లు జానంపేట కృష్ణవేణి, అరుణ, సువర్ణ, తాళ్లగడ్డ చిన్నమ్మ, అచ్చయపల్లి షమీమ్‌కౌసర్, చక్రాపూర్ కనకాపూర్ అంగన్వాడి టీచర్లు పద్మ, ఇందిర, చిన్నారులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్కరిది కాదు

# వనపర్తి నియోజకవర్గం నీ జాగీరా

**క్రమశిక్షణ లేని నువ్వు వెంటనే**

**క్రమశిక్షణ కమిటీ కి రాజీనామా చేయాలి**

**నిన్ను నమ్ముకున్న నాయకులందరూ ఆస్తులు కోల్పోయారు**

**నీవు మాత్రం వందల ఎకరాలు సంపాదించుకున్నావు**

**ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి పై విరుచుకుపడ్డ**

**గోపాల్‌పేట మాజీ ఎంపీపీ ప్రభావతి**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**వనపర్తి క్రైమ్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** జీవితకాలం రాజకీయం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్కరిది కాదని, 40 ఏళ్ల రాజకీయంలో నేడు కొత్త వ్యక్తులకు అవకాశం వస్తే చూసి ఓర్వలేక ఆపసోపాలు పడుతున్నావని గోపాల్‌పేట మాజీ ఎంపీపీ ప్రభావతి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి పై విరుచుకుపడ్డారు. వనపర్తి పట్టణం ఓ ప్రవేట్ ఫంక్షన్ హాల్ లో సోమవారం నిర్వహించిన పత్రిక సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. శవాలపై చిల్లర ఏరుకునే తినే సత్యశీలా రెడ్డికీ రాజకీయ బిక్ష పెట్టానని విమర్శించడం పై ఆమే తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తనకు తన భర్తకు భగవంతుడు కృపతో రాజకీయ పదవులు లభించాయే తప్ప నీలాంటి వ్యక్తుల వల్ల కాదని, మాలాంటి ఎంతోమంది కష్టపడితేనే నువ్వు ఎమ్మెల్యేగా, మంత్రిగా పదవులు అనుభవించావే తప్ప పార్టీ కోసం కష్టపడిన వారిని ఏనాడు పట్టించుకోలేదని ఆమె విమర్శించారు. నేటికీ నా సొంత గ్రామం పోలికే పహాడ్ లో ఎంతోమందికి అన్నం పెడుతున్నానని నువ్వు నీ సొంత గ్రామం తిరుమలాపురంలో ఒక్కరికైనా భోజనం పెట్టావా అని ప్రశ్నించారు. నీ వెంట ఉన్న కార్యకర్తలకు కనీసం మంచి నీళ్లు ఇవ్వని సంస్కారివి నువ్వని, మంది ఇంట్లో రొట్టెలు చేస్తే తినే నీకు మా గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. పోల్కేపహాడ్ లో ఏకగ్రీవం చేసిన అన్నావే అది నా గ్రామ ప్రజల దీవెన తప్ప నీ గొప్పతనం లేదని ఆమే అన్నారు. నువ్వు మా ఊరిలో ఏకగ్రీవం చేయడం కాదు నీ తిరుమలపురంలో ఏకగ్రీవం చేసి నీ విజ్ఞతను నిరూపించుకోవాలని ఆమె సవాల్ విసిరారు. ఎన్నో సంవత్సరాలుగా పార్టీ కోసం పని చేసే వ్యక్తులకు పదవులు దక్కవు కాని నీ కుమారుడికి పదవులు ఏ విధంగా కట్టబెడుతున్నారో చెప్పాలన్నారు. నీ కుమారుడి కంటే సీనియర్లు పార్టీ కోసం పని చేసినవారు ఎవరు మీకు కనబడరా...? అని ఆమె ప్రశ్నించారు. ప్రస్తుత వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యేగా మేఘరెడ్డి కేవలం 14 నెలల్లో 850 కోట్ల అభివృద్ధి పనులను నియోజకవర్గానికి తీసుకువచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికైనా స్వార్థ రాజకీయాలను పక్కనపెట్టి అభివృద్ధిలో పోటీపడి నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేదేందుకు సహకారం అందిస్తే బాగుంటుందని, అప్పుడే నిన్ను నియోజకవర్గ ప్రజలు అభిమానిస్తారు ప్రేమిస్తారని ఆమె సూచించారు. మరోసారి నా కుటుంబం మా ఎమ్మెల్యే మేఘారెడ్డి జోలికి వస్తే ఊరుకునేది లేదని ఆమె హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీ మాజీ చైర్మన్ పుట్టపాకల మహేష్, పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, లక్కాకుల సతీష్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో హైమాస్ట్ లైట్ల వెలుగులు

**లైట్ల ఏర్పటుతో కొత్తదనం**

**సంతరించుకుంటున్న గ్రామాలు...**

**హైమాస్ట్ లైట్ల ప్రారంభ కార్యక్రమంలో**

**ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



హైమాస్ట్ లైట్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 24 ప్రభాత వార్త:** గ్రామాలలో ఏర్పాటుచేసే హైమాస్ట్ లైట్లతో పల్లెల్లో వెలుగులు నిండడంతో పాటు కొత్తదనం సంతరించుకుంటున్నాయని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి, చీకరు చెట్టు తండా, వీరాయపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన, హైమాస్ట్ లైట్లు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు రెండు లక్షల ఖర్చుతో ఏర్పాటు చేసే ఈ హైమాస్ట్ లైట్లతో గ్రామాలలోని కూడళ్ళు వెలుగులతో నిండిపోతున్నాయని, గ్రామీణులకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామాలలో ఏర్పాటు చేసిన ఈ హైమాస్ట్ లైట్ల నిర్వహణను సక్రమంగా చూసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సిద్దయ్య, తిక్కన్న, రాధాకృష్ణ తిరుపతి రెడ్డి, నాయకులు చందు, శ్రీశైలం, వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**పెయింట్స్ షాపుని ప్రారంభించిన ఎమ్మెల్యే**

రుక్కన్నపల్లి తాండాకు చెందిన యువకుడు సచిన్ ఖిల్లాఘణపురం మండలం సోలిపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసుకున్న పెయింట్స్, హార్డ్వేర్ దుకాణాన్ని సోమవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువకులు స్వయం ఉపాధి పై ప్రత్యేక దృష్టి సారిస్తూనే, ప్రభుత్వ ఉద్యోగ సాధనలోనూ పట్టు సాధించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. పెయింట్స్, హార్డ్వేర్ దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్న సచిన్ ను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఖిల్లాఘణపురం మాజీ జెడ్పిటిసి సోలిపురం రవీందర్ రెడ్డి, ముందటి తండా మాజీ సర్పంచ్ జయంతి, భాషా నాయక్, గ్రామస్తులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంప్లెక్స్ మీటింగ్‌కు రాలేదు.. బడికి పోలేదు

**కాంప్లెక్స్ మీటింగ్ పేరుతో స్కూలుకు**

**డుమ్మా కొట్టిన టీచర్లు**

**ఆ తండాలో ప్రధానోపాధ్యాయునిది**

**ఇష్టారాజ్యం..**

**ఎప్పుడనుకుంటే అప్పుడు సెలవే**



ఉపాధ్యాయులు రాకపోవడంతో చెట్లకింద ఆడుకుంటున్న విద్యార్థులు



చీకర్లగడ్డ తండా ప్రాథమిక పాఠశాల

**ధన్వాడ, ఫిబ్రవరి24, ప్రభాతవార్త :** మారుమూల తండ పాఠశాలల్లో ఎవ్వరు రాకున్నా అడగరు ఎవ్వరు వచ్చిన అడగరు అసలు వస్తున్నారా లేదా తెలియడం లేదు. ఒకవేళ అనుకోకుండా ఎవ్వరైనీ విజిట్‌కు వస్తే అక్కడ మీటింగ్ ఉంది పోయింద్రు లేదా అప్పడప్పుడే సెలవును సృష్టించుకోవడం కొంత మంది ఉపాధ్యాయులకు వెన్నతో పెట్టిన విద్య. వేలకు వేలుగా జీతాలు తీసుకుంటూ తాము పనిచేస్తున్న బడులకు ఎప్పుడో ఒక్కసారి చుట్టుపు చూపూగా వచ్చి చేతులు దులుపుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్లితే ధన్వాడ మండలం రాకాసులగుట్ట తండా పాఠశాల, సికర్లగడ్డ తండా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సోమవారం బడికి రాలేదు. అయితే రాకసులగుట్ట తండా పాఠశాలకు మాత్రం చర్లపల్లికి చెందిన ఓ ఉపాధ్యాయుడు మాత్రం ఒక్క రోజు కోసం డిప్యూటేషన్‌పై వచ్చారు.

**కాంప్లెక్స్ మీటింగ్‌పేరుతో స్కూల్కు డుమ్మా**

ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్ జరిగింది. ఈ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు ఇక్కడ లేరు. బడిలో లేరు పేరు మాత్రం కాంప్లెక్స్ మీటింగ్ అని చెప్పి స్కూలుకు డూమ్మా కొట్టారు. ఇదే విషయమై ప్రభాతవార్త ఎంఈఓ గాయత్రిని వివరణ కోరగా కాంప్లెక్స్ మీటింగ్ ఉంది రమ్మని మేము చెప్పాం కాని ఆ ఉపాధ్యాయులు మీటింగ్‌కు రాలేదు, బడిలో లేరు ఎందుకు ఇలా చేశారో అడిగి తెలుసుకుంటానని చెప్పుకొచ్చారు. మీటింగ్‌కు రాలేని విషయమైతే వాస్తవమే. మీటింగ్ల పేరుతో మారుమూల తండా పాఠశాలలకు ఉపాధ్యాయులు ఎప్పుడు వస్తారో ఎప్పుడు పోతారో తెలియని పరిస్థితి ఉందని తండా వాసులు వాపోతున్నారు. పాఠశాలలపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందనడానికి చీకర్లగడ్డతండా, రాకసులగుట్ట తండా సంఘటనలే అందుకు నిదర్శనమని పలువురు వాపోతున్నారు.

## డబుల్ బెడ్రూం కాలనీల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ఎమ్మెల్యే, కలెక్టర్ కు వినతి పత్రం ఇస్తున్న డబుల్ బెడ్ రూమ్ కాలనీల వాసులు

**వనపర్తి టౌన్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా కేంద్రంలోని డబుల్ బెడ్రూం కాలనీలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆయా కాలనీల ప్రజలు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మర్రికుంట నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి డబుల్ బెడ్రూం లబ్ధిదారులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్రూం కాలనీ నాయకులు మండ్ల రాజు, గోపాలకృష్ణ, సాయిలీల, సుజాత, సింగోటి, వజ్రాల రమేష్, రఘుచారి, బి.రాము, తోట బాలరాజులు మాట్లాడుతూ అప్పాయిపల్లి, పీర్లగుట్ట, రాజపేట, పెద్దగూడెం, చిట్యాల రోడ్డులో ఉన్న డబుల్ బెడ్రూం కాలనీలో మంచినీటి సమస్య, వీధి దీపాలు, సిసి రోడ్లు, సెప్టిక్ ట్యాంకులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు గుర్తు చేశారు. గత ప్రభుత్వం పేదలకు, రోడ్ల విస్తరణలో ఆస్తులు కోల్పోయిన వారికి డబుల్ బెడ్రూం బెడ్ ఇండ్లు కేటాయించింది కానీ వాటికి కనీస సౌకర్యాలు లేక ప్రజలు అనేక అవస్తులు పడుతున్నారని వివరించారు. పెద్దగూడెం గుట్ట ప్రాంతంలో డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించడం వల్ల వారి ఇండ్లలోకి వన్యప్రాణులు సంచరిస్తున్నాయని, ప్రజలు బిక్కుబిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్నారని చెప్పారు. పీర్లగుట్ట, పెద్దగూడెం డబుల్ బెడ్రూం కాలనీల్లో ప్రహరీ గోడ నిర్మించాలని, అప్పాయిపల్లి డబుల్ బెడ్రూం కాలనీ రోడ్డులో వీధిలైట్లు లేక రాత్రి సమయంలో ప్రజలు చీకట్లో ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వీధిలైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డిని కాలనీవాసులు కలిసి ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యల వినతి పత్రాన్ని అందజేశారు. స్పందించిన కలెక్టర్, ఎమ్మెల్యే త్వరలో అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జమీర్, నిరంజన్, సురేంద్రబాబు, గన్నోజు రవి ,కుమారాచారి, వినోద్, చందు, సిద్దయ్య, నరేందర్, గొర్ల రమేష్, భూదేవి, రాములమ్మ, తిరుపతయ్య, పెద్ద కాజా, మైను, నూర్ సమద్, నంబి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం రక్షణ సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు చేయూత



సమాచార హక్కు చట్టం రక్షణ సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్యాడ్, పెన్నులు అందజేస్తున్న దృశ్యం

**లింగాల, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు సమాచార హక్కు చట్టం రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు కుర్ర కిషన్ నాయక్ ఆధ్వర్యంలో సోమవారం 107 మంది విద్యార్థులకు ప్యాడ్, పెన్నులను అందజేశారు. అనంతరం సమాచార హక్కు చట్టం రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు కుర్ర కిషన్ నాయక్ మాట్లాడుతూ పదవ తరగతి అనేది విద్యార్థులకు తొలిమెట్టు లాంటిదని, ఉత్తీర్ణత సాధించుటకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాలు అని ఒక నిర్దిష్ట గ్రేడ్ సాధించడం నుండి వారి అధ్యయన అలవాట్లను మెరుగుపరచడం లేదా కొత్త నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో మరింత ముందుకు తీసుకెళ్తాయని వారన్నారు. విద్యార్థులు వారి లక్ష్యాలపై దృష్టి కేంద్రీకరించి, ప్రేరేపించేలా చేస్తాయని విద్యా ప్రయాణంలోని సవాళ్లను పదవ తరగతి విద్య సహాయపడతాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మండల విద్యాధికారి బషీర్ అహ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అజీమ్ రాష్ట్ర కార్యదర్శి పగిడి మర్రి యాదగిరి రాష్ట్ర కోశాధికారి జి.ఆనంద్, టీఎస్ యూటిఎఫ్ ఉప్పునుంతల మండల అధ్యక్షులు, మీసాల మల్లికార్జున్, పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం కొండయ్య, సీనియర్ ఉపాధ్యాయులు వెంకటేశ్వర శర్మ, శంకరయ్య, శేఖర్‌యాదవ్, రమేష్, ధరమ్ సింగ్, రామచంద్రయ్య, శివకుమార్, సురేష్, రాజా, శ్రావణ్ కుమార్, కవితా రాణి, శశికళ, సుజాత, షమీనా, మహేశ్వరి విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు.

### 584మంది నిపుణులు

## ఏడు సార్లు తనిఖీలు..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ , స్థానిక ఎమ్మెల్యే డా. వంశీ కృష్ణ, హైడ్రా కమీషనర్ రంగనాథ్, ఆర్మీ, నేవీ, ఎన్‌డీఆర్ఎఫ్, ఎంఆర్‌టీఎహెచ్, నవయుగ, ఎస్‌సీసీఎల్, జేపి సంస్థల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం విలేకరులతో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, టన్నెల్ లో చిక్కుకున్నవారిని వెలికితీయడానికి అన్ని ప్రయత్నాలను చేస్తున్నట్టు ప్రకటించారు. ఇప్పటికీ వారు సజీవంగా ఉన్నట్టు ఆశాభావం వ్యక్తం చేశారు. టన్నెల్ లో చిక్కుకున్న ఒక అధికారి మొబైల్ ఫోన్ రింగ్ అయిందని, దాని ప్రకారం సిగ్నల్ తో వారి లొకేషన్ గుర్తించామన్నారు.

## ఎవరూ ఆందోళన పడొద్దు..

**- నేను బాగానే ఉన్నాను**

**- కారు ప్రమాద వార్తలపై ఎంపీ డికె.అరుణ క్లారిటీ**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :** మెదక్ జిల్లాలోని ఎల్లారెడ్డిలో ఎన్నికల ప్రచారం ముగించుకుని వస్తున్న సమయంలో తమ కాన్వాయ్‌ను ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో ఎలాంటి ప్రమాదం జరగలేదని ఎంపీ డీకే అరుణ స్పష్టం చేశారు. హైవే మీద మూసాయిపేట దగ్గర ముందుగా వెళ్తున్న కారు సడన్ గా తమ కాన్వాయ్ లోకి వచ్చిన ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో వెనుక ఉన్న కారు ముందు కారును ఢీకొట్టడం జరిగిందన్నారు. ఈ ఘటనలో ముందున్న కారులోని వాళ్లకు గాని.. మాకు గాని ఎలాంటి ప్రమాదం జరగలేదని క్లారిటీ ఇచ్చారు. కార్యకర్తలు, ఎవరు ఆందోళన పడొద్దని, తప్పుడు వదంతులు నమ్మవద్దు చెప్పారు.

## కేజీబీవీ స్కూలులో బస చేసిన అడిషనల్ కలెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

**మద్దూర్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా మద్దూరు మండల పరిధిలోని పెదిరిపహాడ్ గ్రామంలో ఉన్న కేజీబీవీ స్కూలులో సోమవారం రాత్రి నారాయణపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ రాత్రి బస చేసినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులతో అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ వారికి ఎటువంటి సమస్యలు ఉన్న ఆమె దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## బులోరా వాహనం బోల్తా వ్యక్తి మృతి

**మద్దూర్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** బొలేరో వాహనం బోల్తా పడి ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మద్దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నిడ్జింత గ్రామ శివారులో జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం ఈ విధంగా ఉన్నాయి. మద్దూర్ నుంచి కొత్తపల్లికి సిమెంటు లోడుతో బొలేరో వాహనం ఓవర్ స్పీడ్‌గా వెళ్లడం వలన బోల్తా పడింది. వాహనంలో ముగ్గురు ఉండగా మద్దూర్‌కు చెందిన రాములు (45 )అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం

## భార్యను వేధించిన కేసులో భర్తకు రిమాండ్

**మద్దూర్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :** భార్యను వేధించిన భర్తను రిమాండ్‌కు తరలించిన సంఘటన మద్దూర్ పోలీస్ స్టేషన్ లో జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఎస్సై విజయ్ కుమార్ కథనం ప్రకారం ఈ విధంగా ఉన్నాయి. మద్దూర్ మండల పరిధిలోని హనుమాన్ నాయక్ తాండకు చెందిన భాస్కర్ నాయక్ తాగుడుకు బానిసై ఎలాంటి పనిచేయకుండా తన భార్యను అదనపు కట్నం తీసుకురావాలని శారీరకంగా మానసికంగా వేధిస్తూ గత నెల 28వ తేదీ రోజు మద్యం తాగి వచ్చి కట్టెతో కొట్టగా ఆమె కుడి చేతికి, ఇతర శారీరక భాగాలకు గాయాలయ్యాయి. దేవీబాయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై వివరించారు. వీరికి ఇద్దరు మగ, ఒక ఆడ సంతానం ఉన్నారని ఎస్సై తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు భాస్కర్ నాయకును రిమాండ్ నిమిత్తం కోస్గి కోర్టు ముందు హాజరుపరచగా మెజిస్ట్రేట్ 12 రోజులు రిమాండ్ విధించారు.

## చైల్డ్ హెల్ప్ లైన్ సహకారంతో బాల కార్మికునికి విముక్తి

**లింగాల, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని వాటర్ సర్వీసింగ్ సెంటర్లో (17) సంవత్సరాల బాల కార్మికుడు కార్లు మోటార్ సైకిళ్లు వాష్ చేసే పనిలో కనిపించాడు. 1098 టోల్ ఫ్రీకి కాల్ చేయడంతో వెంటనే స్పందించిన చైల్డ్ హెల్ప్ లైన్ అధికారులు బాల కార్మికుడు వివరాలు రాబట్టారు. బాలుని పాఠశాలకు పంపించాలని సూచించారు.